


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 16, పేజీలు - 08

శుక్రవారం, జూన్ 20, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati



## ఇరాన్ పై సైనిక చర్యకు అమెరికా సిద్ధం.?

**- తీవ్ర హెచ్చరిక చేసిన రష్యా**

2లో..



## బ్రిటన్‌లో భారతీయ సంస్థల హవా

2లో..



## సముద్ర జలాల్లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతోంది

2లో..



## అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

2లో..



## సాగు చేసే భూములన్నిటికి రైతు భరోసా

2లో..

## రాజకీయ ఆయుధంగా మారిన బనకచర్ల ప్రాజెక్టు

**- ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్న నేతలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బనకచర్ల ప్రాజెక్టు అనగానే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాస్పద ప్రాజెక్టుగా చర్చల్లో నలుగుతోంది. అయితే ఇది రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ రాజకీయ ప్రత్యర్థులను దెబ్బకొట్టే రాజకీయాస్త్రంగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలు ఈ ప్రాజెక్టు విషయంలో తమ వైఖరిపై కుండబద్ధలు కొట్టినట్లు వ్యవహరిస్తున్నాయో, ప్రత్యర్థులను దెబ్బకొట్టేందుకు కూడా అదే పట్టుదలతో వ్యవహారం నడుపుతున్నాయి. ఈ ప్రాజెక్టు అటు ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు వర్సెస్ జగన్మోహన్ రెడ్డి మధ్య, ఇటు తెలంగాణలో రేవంత్ రెడ్డి వర్సెస్ కేసీఆర్ మధ్య పొలిటికల్ వార్‌గా మారింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో అంతర్గతంగా రాజకీయ దుమారం రేపుతోన్న బనకచర్ల ప్రాజెక్టును రాజకీయంగా ఎలా ఉపయోగపడుతుందా అన్న కోణంలోనే నేతలు ఆలోచన ఉన్నట్టు స్పష్టమవుతోంది.

### బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం ఇదేనా!

బనకచర్ల ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న రేవంత్ రెడ్డి, ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రయోజనాలకు తీరని నష్టంగా అభివర్ణిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ అధినేత కేసీఆర్ అని పదే పదే చెబుతున్నారు. తెలంగాణ ప్రజలకు కేసీఆర్ చేసిన ద్రోహంగా చిత్రీకరించి, ప్రజల్లో కేసీఆర్‌ను దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం ఆరోపణలే కాకుండా, కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నాటి ఏపీ సీఎం జగన్మోహన్ రెడ్డితో గోదావరి జలాలపై రహస్య ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. 2017, 2019లో జరిగిన సమావేశాలను ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రస్తావిస్తున్నారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించడానికి అంగీకరించారన్నది రేవంత్ రెడ్డి ప్రధాన ఆరోపణ. ఇది తెలంగాణ ప్రయోజనాలను కాలరాయడమే కాకుండా, తెలంగాణను వెన్నుపోటు పొడవడమే అని కేసీఆర్‌పై ధ్వజమెత్తుతున్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా తెలంగాణ ద్రోహిగా కేసీఆర్‌ను చిత్రీకరించి రాజకీయంగా దెబ్బకొట్టే వ్యూహంతో రేవంత్ ముందుకు సాగుతున్నారు.

### తెలంగాణ పరిరక్షకుడిని తానే అంటున్న రేవంత్

బనకచర్ల ప్రాజెక్టును తాము వ్యతిరేకిస్తున్నట్లు బీఆర్ఎస్ చెబుతున్నప్పటికీ, గత బీఆర్ఎస్ ప్రభుత్వమే గోదావరి జలాలు తరలింపుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. గతంలో ఓ

3లో..

### దేశంలో ఇంగ్లిష్ మాట్లాడేవారు సిగ్గు పడే రోజు వస్తుంది

**- హెూంమంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కేంద్ర హెూం మంత్రి అమిత్ షా గురువారం నాడు మాట్లాడుతూ, భారతీయ భాషలు దేశ ఆత్మకు, సాంస్కృతిక గుర్తింపుకు చిహ్నాలని, మన భాషా వారసత్వాన్ని తిరిగి స్వీకరించి ప్రపంచం ముందు గర్వంగా నిలబడే సమయం ఆసన్నమైందని అన్నారు.

2లో..

## అనవసరంగా గొడవలు వద్దు

- **బనకచర్లపై ఏపీ సీఎం కీలక వ్యాఖ్యలు**
- **కొత్త ట్రైబ్యునల్ ఎలా చెబితే అలా విందామన్న చంద్రబాబు**
- **దీనిపై పోరాడటం అనవసరం అన్న ఏపీ సీఎం**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ విషయంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం అమరావతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. గోదావరిలో పుష్కలంగా నీళ్లు ఉన్నాయని చెప్పారు. ఆ నీటిని ఏపీ, తెలంగాణ రెండూ వాడుకోవచ్చని తెలిపారు. కృష్ణానదిలో మాత్రమే నీళ్లు తక్కువున్నాయని వాటిపై గొడవ పడితో లాభం లేవన అన్నారు. కొత్త ట్రైబ్యునల్ వచ్చిన తర్వాత వారు ఎలా కేటాయిస్తే అలా



2లో..

### ప్రభుత్వ అధికారులపై హైకోర్టు సీరియస్

**- ఆదేశాలు పాటించకుంటే జైలుకే అని స్పష్టం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇద్దరు ప్రభుత్వ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలు పాటించకపోతే

2లో..

### గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలి

**- కేంద్ర మంత్రికి రేవంత్ విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ/ హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్-1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రికి వారు తెలియజేశారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ



కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో

2లో..

## అణచివేత అనే పదానికి నిర్వచనంగా చంద్రబాబు

- **ప్రతిపక్ష నాయకుడు ప్రజలను కలవకుండా ఆంక్షలు పెట్టడమా.?**
- **ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత**
- **దేశ చరిత్రలోనే బహుశా ఇదే ప్రప్రథమం అంటూ చంద్రబాబుపై మండిపడ్డ జగన్**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** జూన్ రెండు నుంచి అన్ని పథకాలు అమలు చేస్తానంటూ హామీ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబును బాకీలు వసూలు చేయాలని పిలుపునిచ్చారు వైఎస్ జగన్. ఇంటికి టీడీపీ నేతలు వచ్చినప్పుడు గతంలో ఇచ్చిన హామీలు, ఎన్నికల మేనిఫెస్టోను చూపించి నిలదీయాలని పిలుపునిచ్చారు. గత జూన్ నుంచి ఇవ్వాల్సిన పథకాలను వడ్డీతోపాటు ఇచ్చేలా ఒత్తిడి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ సంపదను తన జేబులోకి, తన అనుచరుల జేబులోకి చేరుతోందని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. వచ్చి ఏడాది అయిన తర్వాత ప్రజలకు ఖర్చు పెట్టింది లేదని విమర్శించారు. చేసిన అప్పులు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. కేంద్రం



సంస్థలు ప్రకటించిన ఏ లెక్కలు చూసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

3లో..

## దత్తత గ్రామాన్ని కేసీఆర్ ఆగం చేశారు

- **వాసాలమర్రిలో ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టిన మంత్రి పొంగులేటి**
- **మొదటి లబ్ధిదారు ఆగవ్వకు ఇంటి పట్టా, లక్ష రూపాయల చెక్కు అందజేత**
- **పర్యటనలో మంత్రితో పాటు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు**
- **యాదాద్రి భువనగిరి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వ పథకం అమలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం గురువారం యాదాద్రి భువనగిరి జిల్లాలో లాంఛనంగా ప్రారంభమైంది. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

3లో..



### రేవంత్ రెడ్డిలో విషయం తక్కువ విషం ఎక్కువ

- **జలదోపిడీని అడ్డుకోమ్మని చెబితే రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారు**
- **గోదావరి, కృష్ణా జలాల్లో సీఎం అజ్ఞానంపై హరీశ్‌రావు ఫైర్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఆంధ్ర జలదోపిడీని అడ్డుకోమ్మని చెబితే సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాలని చెప్తే ఏదోదో చెప్పారంటూ దుయ్యబట్టారు. సీఎం రేవంత్ రెడ్డికి నదీ బేసిన్లు కూడా తెలియవంటూ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు విమర్శించారు. గోదావరి, కృష్ణా బేసిన్‌లలో అధిక వాటా కావాలని డిమాండ్ చేయాల్సిన సీఎం ఉన్న వాటాను తగ్గించి అడగడం ఏంటంటూ నిలదీశారు. ఇదే విధంగా సీఎం మాట్లాడితే బ్రజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు మన వాదనలు వీగిపోతాయంటూ హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై బీఆర్ఎస్ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని హరీశ్ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి

2లో..

## మెట్రో ఫేజ్-2కు అనుమతులు ఇప్పించండి

**- కేంద్రానికి సీఎం విజ్ఞప్తి**

- **కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో రేవంత్ రెడ్డి భేటీ**
- **76.4 కి.మీ. మేర మెట్రో ఫేజ్-2 ప్రతిపాదన**
- **రూ.24,269 కోట్ల ప్రాజెక్టు, కేంద్రంతో కలిసి చేపట్టేందుకు రాష్ట్రం సిద్ధం**
- **సవరించిన డీపీఆర్ సమర్పించామని కేంద్ర మంత్రికి వివరణ**

**న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ నగరంలో ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం కేంద్ర మంత్రిని కోరారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగర అవసరాలకు అనుగుణంగా 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి కూలంకషంగా వివరించారు. సుమారు రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ప్రతిష్టాత్మక



ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నగరంలో ప్రయాణం వేగవంతం కావడమే కాకుండా, రోడ్లపై ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని, తద్వారా సుస్థిరమైన అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధి శాఖ చేసిన సూచనల మేరకు మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు

2లో..

### ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు చేయూత ఇవ్వండి

**- కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయతో లోకేశ్ భేటీ**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించే స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి సహకారం అందించాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడలు, కార్మిక, ఉపాధి శాఖల మంత్రి మన్సుఖ్ మాండవీయను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. న్యూఢిల్లీలో కేంద్రమంత్రి మన్సుఖ్ తో లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ అమరావతిలో రాజధాని నిర్మాణపనులు శరవేగంగా కొనసాగుతున్నాయి, స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. క్రీడల అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోంది. ప్రపంచస్థాయి శిక్షణ, సౌకర్యాలను కల్పించడం, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై

3లో..

# ఇరాన్ పై సైనిక చర్యకు అమెరికా సిద్ధం.?

**- తీవ్ర హెచ్చరిక చేసిన రష్యా**

**ఇరాన్ (ప్రశ్న న్యూస్)** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో, ఈ వివాదంలో అమెరికా సైనిక జోక్యానికి పాల్పడితే తీవ్ర పరిణామాలు తప్పవని రష్యా గురువారం నాడు ఘాటుగా హెచ్చరించింది. ఇది అత్యంత ప్రమాదకరమైన చర్య అవుతుందని, ఊహించని ప్రతికూల పర్యవసానాలకు దారితీస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు రష్యా విదేశాంగ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా కీలక వ్యాఖ్యలు చేశారు.

### అమెరికాకు రష్యా వార్నింగ్

మాస్కోలో విలేకరుల సమావేశంలో మరియా జఖరోవా మాట్లాడుతూ, "ఈ క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా సైనిక జోక్యానికి దూరంగా ఉండాలని వాషింగ్టన్‌ను ప్రత్యేకంగా, గట్టిగా హెచ్చరిస్తున్నాం. ఇది నిజంగా ఊహించని ప్రతికూల పర్యవసానాలతో కూడిన అత్యంత ప్రమాదకరమైన చర్య అవుతుంది" అని తెలిపారు. అంతకుముందు, రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ కూడా ఇజ్రాయెల్‌కు అమెరికా ప్రత్యక్ష సైనిక సహాయం అందించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటువంటి కల్పిత ప్రత్యామ్నాయాలకు కూడా వాషింగ్టన్ దూరంగా ఉండాలని, లేకపోతే మొత్తం పరిస్థితి అస్థిరపడుతుందని హెచ్చరించారు.

### అణు విపత్తు ముంగిట ప్రపంచం!

ఇరాన్ అణు స్థావరాలపై ఇజ్రాయెల్ దాడుల కారణంగా ప్రపంచం పెను విపత్తుకు అతి సమీపంలో ఉందని జఖరోవా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "అణు కేంద్రాలపై దాడులు జరుగుతున్నాయి" అని ఆమె ఉద్ఘాటిస్తూ, ఐక్యరాజ్యసమితి అణు భద్రతా సంస్థ ఇప్పటికే నిర్దిష్ట నష్టాన్ని గుర్తించిందని తెలిపారు. "యావత్ ప్రపంచ సమాజం ఆందోళన ఎక్కడ? ఫుకుషిమాలో ఏం జరిగిందో వారు గుర్తుచేసుకోవాలి" అంటూ 2011 జపాన్ అణు ప్రమాదాన్ని ప్రస్తావించారు. ఇరాన్‌లోని బుషెర్ అణు విద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి జరిగితే చెర్నోబిల్ తరహా విపత్తు సంభవించే ప్రమాదం ఉందని రష్యా అణు ఇంధన సంస్థ అధిపతి కూడా హెచ్చరించారు. కాగా, బుషెర్ అణు కేంద్రాన్ని రష్యానే నిర్మించింది.

### శాంతి యత్నాలు - ట్రంప్ వైఖరి

ఇదిలా ఉండగా, ఇరాన్‌పై దాడుల్లో ఇజ్రాయెల్‌తో చేరడాన్ని తాను పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. మరోవైపు, రష్యా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లు ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య సంఘర్షణను తక్షణమే ఆపివేయాలని, టెహ్రాన్ అణు సమస్యకు దౌత్య, రాజకీయ పరిష్కారం కనుగొనాలని పిలుపునిచ్చాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, యూఏఈ అధినేత మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ఫోన్‌లో సంభాషించారు. గత వారం పుతిన్ ఇరు దేశాల నేతలకు ఫోన్ చేసి మధ్యవర్తిత్వం వహిస్తానని ప్రతిపాదించగా, ఆ ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించారు. "ముందు రష్యాలో మీ సమస్యలు పరిష్కరించుకోండి" అంటూ పుతిన్‌కు ట్రంప్ చురకలంటించడం గమనార్హం.

# బ్రిటన్‌లో భారతీయ సంస్థల హవా

**- భారీగా పెరిగిన ఆదాయం, ఉద్యోగాలు**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత్, బ్రిటన్ మధ్య ఆర్థిక భాగస్వామ్యం మరింత బలపడుతోందని చెప్పడానికి నిదర్శనంగా, బ్రిటన్‌లో పనిచేస్తున్న భారతీయ యాజమాన్యంలోని కంపెనీల సంఖ్య గణనీయంగా పెరిగింది. గురువారం విడుదలైన ఒక నివేదిక ప్రకారం 2024లో 971గా ఉన్న ఈ సంస్థల సంఖ్య, 2025 నాటికి 23 శాతానికి పైగా వృద్ధితో 1,197కు చేరింది. 2017లో గ్రాంట్ థోర్న్టన్ సంస్థ కచ్చితమైన సంఖ్యలను ట్రాక్ చేయడం ప్రారంభించినప్పటి నుంచి ఇదే అత్యధిక పెరుగుదల కావడం విశేషం. ఈ భారతీయ కంపెనీలు యూకేలో సంపాదించిన మొత్తం ఆదాయం కూడా 2024లోని 68.09 బిలియన్ పౌండ్ల నుంచి 72.14 బిలియన్ పౌండ్లకు పెరిగింది. ఈ వ్యాపార సంస్థలు యూకే వ్యాప్తంగా 1,26,720 మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. గత ఏడాది కాలంలోనే 8,000కు పైగా కొత్త ఉద్యోగాలను సృష్టించాయి."ఈ కంపెనీలలో మహిళా డైరెక్టర్ల నిష్పత్తి కూడా 2024లో 21 శాతం ఉండగా, అది 24 శాతానికి పెరిగింది. ఈ ఏడాది అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న కంపెనీల జాబితాలో 74 సంస్థలు 10 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఆదాయ వృద్ధిని నమోదు చేశాయి" అని నివేదిక ప్రస్తావించింది. గ్రాంట్ థోర్న్టన్ భాగస్వామి, సౌత్ ఏషియా బిజినెస్ గ్రూప్ హెడ్ అనుజ్ చండే మాట్లాడుతూ "ఈ ఏడాది 'ఇండియా మీట్స్ బ్రిటన్ ట్రాకర్' నివేదికలోని అంశాలు ఈ రెండు గొప్ప దేశాల మధ్య ఉన్న లోతైన, చారిత్రక సంబంధానికి నిదర్శనం. భారతీయ కంపెనీలు వృద్ధి చెందడానికి యూకేను ఒక కీలక పెట్టుబడి కేంద్రంగా భారత్ చూస్తోందని స్పష్టమవుతోంది" అని తెలిపారు.

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సహకారంతో రూపొందిన ఈ నివేదిక, ఇండియా గ్లోబల్ ఫోరం (ఐజీఎఫ్) చేరికతో మరింత బలోపేతమైంది. ఐజీఎఫ్ తన దీర్ఘకాల అనుభవం, నైపుణ్యం, భారత్-యూకే కారిడార్‌లో ఉన్న పలుకుబడితో ఈ నివేదికకు మరింత విలువ చేకూర్చింది. లండన్‌లోని క్వీన్ ఎలిజబెత్-%××% సెంటర్‌లో ఐజీఎఫ్ లండన్ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ప్రత్యేక ప్రారంభ సెషన్‌లో యూకే వాణిజ్య, వ్యాపార శాఖ మంత్రి జోనాథన్ రేనాల్డ్స్, కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఈ నివేదికను అధికారికంగా విడుదల చేశారు. "విప్రో ఐటీ సర్వీసెస్ యూకే సొసైటాస్ 448 శాతం ఆదాయ వృద్ధితో వృద్ధి ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. కొత్తగా ప్రవేశించిన కార్పొరేట్ ఐటీ మేనేజ్‌మెంట్ సంస్థ జోహో కార్పొరేషన్ లిమిటెడ్ 197 శాతం వృద్ధితో తర్వాతి స్థానంలో ఉంది" అని నివేదిక పేర్కొంది.

కంపెనీల ప్రధాన కార్యాలయాల పరంగా చూస్తే, లండన్ మొదటి చాయిస్‌గా కొనసాగుతోంది. మొత్తం కంపెనీలలో 47 శాతం లండన్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత సౌత్ ఆఫ్ ఇంగ్లాండ్ (24.3 శాతం) ఉంది. రంగాల వారీగా చూస్తే, టెక్నాలజీ, మీడియా, టెలికమ్యూనికేషన్స్ (టీఎంటీ) రంగం 31 శాతం ట్రాకర్ కంపెనీలతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అలాగే ఫార్మాస్యూటికల్స్, రసాయనాల రంగం 22 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. లండన్ గ్లోబల్ ఫైనాన్స్ హబ్‌లో భారతీయ బ్యాంకులు, ఆర్థిక సంస్థల వ్యూహాత్మక విస్తరణ కారణంగా ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగం కూడా ట్రాకర్ కంపెనీలలో 9.5 శాతానికి పెరిగింది. ఇటీవలి సంవత్సరాలలో ఇదే అత్యధిక వృద్ధిని నమోదు చేసిందని నివేదిక పేర్కొంది.

# సముద్ర జలాల్లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతోంది

**- విశాఖలో ఐఎన్ఎస్ అర్నాల యుద్ధనౌక ప్రారంభం**

విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) భారత నౌకాదళం అమ్ములపొదిలోకి మరో శక్తివంతమైన అస్త్రం చేరింది. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ సంస్థ తయారుచేసిన యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్-షాలో వాటర్ క్రాఫ్ట్ ఐఎన్ఎస్ 'అర్నాల'ను విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డ్‌లో ఘనంగా ప్రారంభించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ ఈ నౌకను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడుతూ, ఒకప్పుడు ఆయుధాల కోసం ఇతర దేశాలపై ఆధారపడిన భారత్, ఇప్పుడు వాటిని స్వయంగా తయారుచేసే స్థాయికి ఎదిగిందని అన్నారు. సముద్ర జలాల్లో భారత్ తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని ఆయన పేర్కొన్నారు. దేశీయ పరిజ్ఞానంతో ఇప్పటివరకు 98 యుద్ధ నౌకలను నిర్మించామని, ఇందులో ఐఎన్ఎస్ విక్రాంత్ వంటి విమాన వాహక నౌకలు, అణు జలాంతర్గాములు, ఫ్రిగేట్లు, కార్వెట్లు ఉన్నాయని వివరించారు. మరో 60 నౌకలు నిర్మాణ దశలో ఉండగా, 180 నౌకల నిర్మాణానికి ఒప్పందాలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. కొత్తగా నౌకాదళంలో చేరిన 'అర్నాల' సవాళ్లను స్వీకరించగలదని, భారత తీర ప్రాంత రక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్, వార్‌షిప్ ప్రొడక్షన్ అండ్ అక్విజిషన్ కంట్రోలర్ వైస్ అడ్మిరల్ రాజారామ్ స్వామినాథన్, జీఆర్ఎస్ఈ సీఎండీ కమొడోర్ పి. హరి తదితరులు పాల్గొన్నారు.

# ఈఏడాది పాత విధానంలోనే ఇంజనీరింగ్ ఫీజులు

**హైదరాబాద్ :** తెలంగాణలో ఇంజినీరింగ్ విద్యార్థులకు శుభవార్త. ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల పెంపునకు ఈ ఏడాది సర్కారు నిరాకరించింది. ఇష్టారీతిన ఫీజుల పెంపు ప్రతిపాదనలపై ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది. కొత్త ఫీజుల అధ్యయనానికి కమిటీ వేయాలని డిసైడ్ అయ్యారు. ఇప్పటికే ఫీజుల అంశంపై భేటీ అయిన టీఏఎఫ్ఆర్సీ ? తెలంగాణ అడ్మిషన్స్, ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఈ యేడాది పాత ఫీజులతోనే ఇంజినీరింగ్ కౌన్సిలింగ్ నిర్వహించాలని నిర్ణయించారు.ఈ ఏడాది ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం జులై మొదటి వారంలో ఎప్ సెట్ కౌన్సిలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో ఫీజుల పెంపు అంశంపై కాలేజీల ప్రతిపాదనలంపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఫీజుల సవరణపై, ప్రతిపాదనల అధ్యయనానికి ఒక సబ్ కమిటీ వేయాలని నిర్ణయించారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన

**- 30 రోజుల్లో ప్రాథమిక, ఏడాదిలో తుది నివేదిక సమర్పణ**

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఘోర ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. జూన్ 12న సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్ కు బయలుదేరిన బోయింగ్ విమానం టేకాఫ్ అయిన క్షణాల వ్యవధిలోనే మేఘనీ నగర్‌లోని సివిల్ హాస్పిటల్ క్యాంపస్‌పై కుప్పకూలింది. ఈ దురదృష్టకర ఘటనలో పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) నేతృత్వంలో సమగ్ర విచారణ జరుగుతోందని పౌర విమానయాన శాఖ తెలిపింది. యూఎన్ ఐసీఏఓ (అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ) నిబంధనలకు అనుగుణంగా ఈ దర్యాప్తు సాగుతోంది. ఇందులో అమెరికా, యూకే దేశాలకు చెందిన నిపుణులతో పాటు బోయింగ్, జనరల్ ఎలక్ట్రిక్, ఎయిర్ ఇండియా ప్రతినిధులు, భారతీయ నియంత్రణ సంస్థల అధికారులు పాలుపంచుకుంటున్నారు.విమానంలో ఇంజన్ వైఫల్యం, ఫ్లాప్‌లు, ల్యాండింగ్ గియర్ సమస్యలు, ఎలక్ట్రానిక్ లోపాలు, ఇంధన కాలుష్యం వంటి అనేక అంశాలపై దర్యాప్తు బృందం దృష్టి సారించింది. ఘటనా స్థలంలో లభ్యమైన విమాన శకలాలు, సీసీటీవీ ఫుటేజీ, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, పైలట్ల శిక్షణ రికార్డులు, విమానం బరువు, ఇంజన్ థరస్ట్, ఏసీఏఆర్ఎస్ (ఎయిర్‌క్రాఫ్ట్ కమ్యూనికేషన్స్ అడ్రసింగ్ అండ్ రిపోర్టింగ్ సిస్టమ్) డేటాను క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. ఐసీఏఓ మార్గదర్శకాల ప్రకారం, ప్రాథమిక నివేదికను 30 రోజుల్లోగా, పూర్తిస్థాయి నివేదికను 12 నెలల్లోగా సమర్పించాల్సి ఉంటుంది. బ్లాక్‌బాక్స్ డీకోడింగ్‌కు సంబంధించిన నిర్ణయాన్ని సాంకేతిక ఆధారాల మేరకే ఏఏఐబీ తీసుకుంటుందని, మీడియాలో వస్తున్న ఊహాగానాలను నమ్మవద్దని పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది. మరోవైపు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) కూడా చర్యలు చేపట్టింది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787-8, 787-9 రకం విమానాల్లో 34 విమానాలకు గాను ఇప్పటికే 24 విమానాల్లో తనిఖీలు పూర్తి చేసినట్లు డీజీసీఏ తెలిపింది. ఈ తనిఖీల్లో ఇప్పటివరకు ఎటువంటి తీవ్రమైన లోపాలు కనబడలేదని అధికారులు పేర్కొన్నారు.

# సాగు చేసే భూములన్నిటికి రైతు భరోసా

**- రైతు భరోసా పడని వారికి మంత్రి తుమ్మల కీలక సూచన**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం యాసంగికి సంబంధించి రైతు భరోసా నిధులు విడుదల చేస్తుంది. నాలుగు రోజుల నుంచి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేస్తుంది. పోయిన సీజన్‌తో పోలిస్తే ఈసారి భిన్నంగా ఎకరాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి రైతు ఖాతాలో నిధులు జమ చేస్తామని కాంగ్రెస్ సర్కార్ తెలిపింది. అందుకు తగ్గట్టుగానే ఇప్పటి వరకు 5 ఎకరాల వరకు రైతుల ఖాతాలో భరోసా నిధులు జమ అయ్యాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో అర్హత ఉన్నా సరే కొందరు రైతుల ఖాతాలో డబ్బులు పడలేదు. అలాంటి వారికి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు కీలక సూచన చేశారు.రాష్ట్రంలో అర్హత ఉండి రైతు భరోసా నిధులు ఖాతాలో పడని రైతులు కంగారు పడాల్సిన పని లేదని వారికి కూడా రైతు భరోసా సాయం అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అర్హత ఉండి బ్యాంకు ఖాతాలో భరోసా నిధులు జమ కాని రైతులు స్థానిక వ్యవసాయ అధికారులను కలిసి వారి సమస్యను తెలుసుకుని మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అలానే రాష్ట్రంలో కొత్తగా భూముల యాజమాన్యం పొందిన అన్నదాతలు కూడా రైతు భరోసా నిధులు పొందడానికి అర్హులవుతారని ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు రాష్ట్రంలో కొత్తగా భూమి యాజమాన్య హక్కులు పొందిన రైతులు కూడా రైతు భరోసాకు అర్హులని ప్రకటించింది. వీరు జూన్ 20వ తేదీ వరకు రైతు భరోసా పథకం కోసం అప్లై చేసుకోవాలని తెలిపింది. రైతు భరోసాకు అప్లై చేసుకోవాలని భావించిన వారు స్థానిక ఏఈవో దగ్గరకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేయాలి. అయితే జూన్ 20వ తేదీ వరకు అప్లై చేసుకున్న వారికి మాత్రమే భరోసా సాయం అందుతుందని అధికారులు తెలిపారు. ఇంకా ఒక్క రోజు సమయం మాత్రమే ఉంది కనుక అర్హత ఉండి రైతు భరోసా పడని రైతులు త్వరగా అప్లై చేసుకోవాలని చెబుతున్నారు.గురువారం వరకు అంటే జూన్ 19 వరకు ఐదు ఎకరాల్లోపు రైతులకు వారి బ్యాంకు ఖాతాలో భరోసా నిధులు జమ చేసింది. ఎకరాల వారిగా నిధులు విడుదల చేస్తుంది. ఇక ఇప్పటి వరకు ఐదు విడుతల్లో ప్రభుత్వం 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6404.7 కోట్లు జమ చేసింది. మొత్తం తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్లు రిలీజ్ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఎన్ని ఎకరాలని చూడకుండా అర్హులైన వ్యవసాయం చేసే ప్రతి రైతుకు రైతు భరోసా నిధులు అందిస్తామని సీఎం రేవంత్ తెలిపారు.

# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలి

కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని జీడబ్ల్యూడీటీ-1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని.. బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రికి తెలియజేశారు.బనకచర్ల విషయంలో ఏ నిబంధనలు పాటించని ఆంధ్రప్రదేశ్ వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరమని జల్ శక్తి మంత్రితో సీఎం పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టిందని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. జీడబ్ల్యూడీటీ-1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని.. తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉందని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం వివరించారు. జాతీయప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

### - 1500 టీఎంసీలకు వాడుకునేలా అనుమతులు కావాలి

తెలంగాణకు గోదావరి నదిలో 1000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు మొత్తంగా 1500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 1500 టీఎంసీల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని.. ఆ తర్వాత ఏపీ చేప్టటే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదని జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య పలు అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రితో సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘంగా సాగిన సమావేశంలో తమ విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. బనకచర్లకు సంబంధించిన డీపీఆర్ తమకు అందలేదని కేంద్ర మంత్రి తెలిపారని త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# మెట్రో ఫేజ్-2కు అనుమతులు ఇప్పించండి

సంబంధించి అవసరమైన మార్పులు చేర్పులతో కూడిన సవివరమైన ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇప్పటికే సమర్పించిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరానికి మెట్రో రెండో దశ ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఇతర శాఖల నుంచి కూడా అనుమతులు త్వరితగతిన ఇప్పించాలని ఆయన కేంద్ర మంత్రికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో మెట్రో విస్తరణ ఆవశ్యకత, ప్రయోజనాలపై సమగ్ర చర్చ జరిగినట్లు సమాచారం.

# దేశంలో ఇంగ్లిష్ మాట్లాడేవారు సిగ్గు పడే రోజు వస్తుంది

మాజీ ఐఏఎస్ అధికారి అశుతోష్ అగ్నిహోత్రి రాసిన 'మై బూంద్ స్వయం, ఖుద్ సాగర్ హూ' పుస్తకాన్ని విడుదల చేసిన సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ, భారతదేశంలో త్వరలో ఇంగ్లీష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజువస్తుందని అన్నారు. ఆయన మాట్లాడుతూ, "మార్పు సాధ్యం కాదని భావించేవారు, మార్పును నిశ్చయంగా తీసుకురాగలరని మర్చిపోతున్నారు. మన భాషలు మన సంస్కృతికి రత్నాలు, వాటి లేకుండా మనం భారతీయులుగా ఉండలేము." అని అన్నారు.

### - దేశాన్ని అర్థం చేసుకోవడానికి విదేశీ భాష సరిపోదు

భారతదేశం, దాని చరిత్ర, సంస్కృతి, మతాన్ని అర్థం చేసుకోవడానికి విదేశీ భాషలు ఎప్పటికీ సరిపోవని షా అన్నారు. ఆయన మాట్లాడుతూ, "అసంపూర్ణమైన విదేశీ భాషలతో భారతదేశాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేము. ఇది సులభమైన పోరాటం కాదని నాకు తెలుసు, కాని భారతీయ సమాజం ఈ పోరాటంలో కచ్చితంగా విజయం సాధిస్తుందని నేను పూర్తిగా నమ్ముతున్నాను. ఆత్మగౌరవంతో మన భాషల్లో దేశాన్ని నడిపిస్తాము. ప్రపంచానికి నాయకత్వం వహిస్తాము." అని అన్నారు.

### - 'పంచ ప్రాణ్' భారతదేశానికి అమృతకాల మార్గం

అమిత్ షా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమర్పించిన 'పంచ ప్రాణ్' (ఐదు ప్రతిజ్ఞలు) గురించి ప్రస్తావిస్తూ, ఇవి నేడు 130 కోట్ల మంది భారతీయుల సంకల్పంగా మారాయని అన్నారు. ఆయన మాట్లాడుతూ, "అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యం, బానిసత్వ మనస్తత్వం నుంచి విముక్తి, మన గర్వించదగిన గతానికి గర్వం, ఐక్యత, సమగ్రతకు అంకితం, పౌరులలో కర్తవ్య భావం - ఈ ఐదు ప్రతిజ్ఞలతో, మనం 2047 నాటికి ప్రపంచ శిఖరాగ్రాన ఉంటాము. ఇందులో మన భాషలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి." అని అన్నారు.

### - అడ్మినిస్ట్రేటివ్ అధికారుల శిక్షణలో మార్పులు

పుస్తక రచయిత అశుతోష్ అగ్నిహోత్రి అనుభవాల గురించి మాట్లాడుతూ, పరిపాలనా అధికారుల శిక్షణ వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని హోం మంత్రి అన్నారు. ఆయన మాట్లాడుతూ, "నేటికీ మన పరిపాలనా శిక్షణలో సానుభూతికి స్థానం లేదు, బహుశా ఇది బ్రిటిష్ కాలం నాటి ఆలోచనల ప్రభావం కావచ్చు. ఏ అధికారి అయినా సానుభూతి లేకుండా పరిపాలిస్తే, అతను పరిపాలన అసలు ఉద్దేశ్యాన్ని ఎప్పటికీ సాధించలేడు." అని అన్నారు. అమిత్ షా సాహిత్యం పాత్రను కూడా నొక్కిచెప్పారు. "దేశం అంధకారంలో మునిగిపోయినప్పుడు కూడా, సాహిత్యం మన మతం, స్వాతంత్ర్యం, సంస్కృతి జ్యోతిని వెలిగించింది. ప్రభుత్వాలు మారాయి, కాని ఎప్పుడైతే ఎవరైనా మన సంస్కృతి, సాహిత్యాన్ని టచ్ చేయాడానికి ప్రయత్నించారో, సమాజం దానిని వ్యతిరేకించింది. సాహిత్యం సమాజ ఆత్మ." అని అన్నారు.

# అనవసరంగా గొడవలు వద్దు

తీసుకుందామని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరూ ఎవరిపై పోరాడాల్సిన అవసరం లేదని కూర్చుని మాట్లాడుకుంటేే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. "నేను ఎప్పుడూ తెలంగాణతో గొడవ పడలేదు. గోదావరిలో మిగిలిన నీటినే మేము వాడుకుంటాం. సముద్రంలోకి వెళ్లే నీటికి సంబంధించి ఇచ్చుపుచ్చుననే ధోరణిలో వాడుకుందాం అన్నారు. దీనిపై కేంద్రంతో మాట్లాడుకుందాం" అని చంద్రబాబు అన్నారు. ఇక తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తాను ఏనాడూ అడ్డుచెప్పలేదని చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలంగాణపై భాగంలో ఉంది, కింద ఉన్న ఆంధ్రప్రదేశ్ నీళ్లు వాడుకుంటే తప్పేంటి అని ప్రశ్నించారు. సముద్రంలో కలిసే నీళ్ల వాడుకుంటామంటే రాద్ధాంతాలు, అభ్యంతరాలు ఎందుకు అన్నారు. తెలంగాణలోనూ ప్రాజెక్టులు కట్టాలి ప్రజలు, రైతులు అందరూ బాగుండాలని తాను కోరుకుంటానని చంద్రబాబు అన్నారు. అంతేకానీ ప్రజా ప్రయోజనాల విషయంలో తాను రాజకీయాలు చేయనని అన్నారు. ఈ విషయంపై అనవసరంగా గొడవలు చేసి ప్రజలను మభ్యపెట్టొద్దని రెండు రాష్ట్రాల నాయకులకు హితవు పలికారు. బనకచర్లతో ఎవరికీ నష్టం లేదని స్పష్టం పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ను కలిశారు. 014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలి. బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని ఎలాంటి అనుమతులు ఇవ్వవొద్దని కోరారు.

# ప్రభుత్వ అధికారులపై హైకోర్టు సీరియస్

జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది. మూసీ సుందరీకరణలో ప్రభుత్వం సేకరించిన భూమికి బదులుగా మరో ప్లాటును ఇస్తామని హామీ ఇచ్చి దాన్ని ఉల్లంఘించిన అధికారులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మూడు నెలల్లో కోర్టు ఆదేశాలను అమలు చేయకపోతే రెండు వారాలు జైలుకెళ్లాల్సి వస్తుందంటూ హైకోర్టు ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, మరో అధికారిణి ప్రసూనాంబలను హెచ్చరించింది. జైలు శిక్షతో పాటుగా జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. మూసీ సుందరీకరణలో భాగంగా సేకరించిన భూమికి ప్రత్యామ్నాయంగా 2016లో కేటాయించిన 666.67 చదరపు గజాల ప్లాటును యజమానికి రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కానీ మాట నిలబెట్టుకోలేదు. పైగా కోర్టు ప్రశ్నించిన ప్రతి సారి.. కోర్టు ధిక్కరణను తప్పించుకోవడం కోసం సదరు అధికారులు ప్లాటు అప్పగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని చెప్తూ వస్తున్నారు తప్ప భూమిని కోల్పోయిన వ్యక్తికి న్యాయం చేయాలన్న ఉద్దేశం వారికి ఏమాత్రం లేదని ఈ సందర్భంగా తెలంగాణ కోర్టు అభిప్రాయపడింది. ఇకపై ఇలా కుదరదని కోర్టు స్పష్టం చేసింది.

మూడు నెలల్లోపు ప్లాట్ రిజిస్ట్రేషన్ పూర్తి కాకపోతే దీనికి సంబంధించిన అధికారులు జైలుకెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించింది.హైదరాబాద్, ఉప్పల్ భగాయత్‌లో మూసీ సుందరీకరణ కోసం భూమి సేకరించిన సమయంలో నిర్వాసితుడైన ఎస్.రాంరెడ్డి అనే వ్యక్తికి మరో ప్లాటు కేటాయించింది ప్రభుత్వం. దానిని రిజిస్టర్ చేయించి ఇవ్వాలంటూ హైకోర్టు 2023 ఫిబ్రవరిలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అధికారులు వాటిని అమలు చేయకపోవడంతో రాం రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఇరు వైపుల వాదనలు విన్న కోర్టు మూడు నెలల్లో ప్లాటును రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వకపోతే సంబంధిత అధికారులు అర్వింద్‌కుమార్, ప్రసూనాంబలు రెండు వారాల పాటు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పు వెలువరించింది. దీంతో పాటుగా రూ.వెయ్యి జరిమానా చెల్లించాలని, లేదంటే మరో వారం రోజుల జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందనిపేర్కొన్నది. అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కోర్టు ఇలాంటి తీర్పు వెలువరించడం సంచలనంగా మారింది.

# రేవంత్ రెడ్డిలో విషయం తక్కువ విషం ఎక్కువ

నదీ బేసిన్లు కూడా తెలియవని, దేవాదుల ఏ బేసిన్‌లో ఉందని సీఎం అడిగారు అని హరీశ్రావు చెప్పారు. 23 ఏళ్ల క్రితం ప్రారంభమైన దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో కూడా సీఎంకు తెలియట్లేదని, బనకచర్ల ఏ బేసిన్‌లో ఉందని నిన్నటి సమావేశంలో అధికారులను అడిగారని అన్నారు. బనకచర్ల కర్నూలు జిల్లాలో ఉంటే సీఎం సలహాదారు మాత్రం ప్రకాశం జిల్లాలో ఉందని చెప్పారని, నల్లమల ఏ రాష్ట్రంలోకి వస్తుందని అధికారులను సీఎం అడిగారని తెలిపారు. తాను అడిగిన తర్వాత లేఖలపై పాత డేట్లు వేసి విడుదల చేశారని హరీశ్‌రావు ఆపోపించారు. బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు సీఎం మీటింగ్ పెట్టినట్లుందని హరీశ్‌రావు అన్నారు. బనకచర్లను నిరసిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని అడిగితే స్పందన లేదని, గోదావరిలో వెయ్యి టీఎంసీలు తెలంగాణకు ఇచ్చి నీ ఇష్టమున్నంత తీసుకో అని చెప్పారని, తెలంగాణకు గోదావరి ట్రైబ్యునల్ 968 టీఎంసీలు కేటాయించిందని తెలిపారు. 968 టీఎంసీలు మన హక్కు ఉండగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును వెయ్యి టీఎంసీలు అడగటం ఏమిటని? ప్రశ్నించారు. గోదావరిలో 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని సీడబ్ల్యూసీ చెప్పిందని అన్నారు. తెలంగాణకు 1950 టీఎంసీలు ఇవ్వాలని కేంద్రమంత్రికి కేసీఆర్ లేఖ రాశారని గుర్తు చేశారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు 763 టీఎంసీలు కావాలని కేసీఆర్ అడిగారని, కేసీఆర్ ఆదేశం మేరకు బ్రిజేశ్ ట్రైబ్యునల్ ముందు అఫిడవిట్ దాఖలు చేశామని, కృష్ణాలో 763 టీఎంసీల కోసం వాదిస్తుంటే 500 టీఎంసీలు అడగటమేంటని ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణకు మేలు జరిగేలా ప్రాజెక్టులు రూపొందించాలని కేసీఆర్ చెప్పారని, తెలంగాణను సంప్రదించకుండా నదుల అనుసంధానంపై ముందుకెళ్లవద్దని చెప్పారని, గోదావరి జలాలను సాగర్ నుంచి శ్రీశైలంకు తీసుకురావాలని జగన్‌తో కేసీఆర్ చెప్పారని తెలిపారు. సాగర్, శ్రీశైలం ద్వారా అయితే తెలంగాణకు లాభమని కేసీఆర్ భావించారని, జగన్ అంగీకరించకపోవడంతో ఆ ప్రతిపాదన ముందుకు పోలేదని, రెండు లిఫ్టులు ఉంటేనే తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి నీరు వస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని అంటున్నారని తెలిపారు.

## ప్రజా పిర్యాదులను క్షేత్రస్థాయిలో

# పరిశీలించి పరిష్కరించండి

**- కమిషనర్ ఎన్.మౌర్య**



**తిరుపతి** ప్రజల నుండి అందిన పిర్యాదులను ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక లో వచ్చిన సమస్యలను కమిషనర్ గురువారం కొర్లగుంట, సాయి విష్ణు లేఔట్, ఇఎస్ఐ హాస్పిటల్, తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా నిర్మాణాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాయి విష్ణు లేఔట్ లో నూతనంగా నిర్మించిన అపార్ట్మెంట్ లో అన్ని నిబంధనల మేరకు ఉన్నాయా అని మరో మారు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ఎస్ ఐ హాస్పిటల్ వద్ద మురుగు కాలువలోని చెత్తను వెంటనే తొలగించి, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులు అందరూ వారి వారి పరిధిలోని ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు. కమిషనర్ వెంట ఏసిపి మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

# రాజకీయ ఆయుధంగా మారిన బనకచర్ల ప్రాజెక్టు

ఇప్పుడు ఓ మాట మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనమని రేవంత్ రెడ్డి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అంతే కాకుండా, ఈ ప్రాజెక్టును అడ్డుకోవడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రాజెక్టు అనుమతులు రాకుండా చూస్తామని ప్రకటించారు. టెక్నికల్‌గా, పొలిటికల్‌గా, లీగల్‌గా అడ్డుకుంటామని చెబుతున్నారు. తద్వారా తెలంగాణ పరిరక్షకుడిని తానేనని రేవంత్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారు. ఈ వ్యాఖ్యల ద్వారా తాను తెలంగాణ పరిరక్షకుడిగా, కేసీఆర్‌ను తెలంగాణ ద్రోహిగా చిత్రీకరించడమన్నది రేవంత్ రెడ్డి వ్యూహంలో భాగమని చెప్పవచ్చు.

### - బీజేపీనీ వదలని రేవంత్ రెడ్డి

ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందాన రేవంత్ రెడ్డి రాష్ట్రంలో తమ ప్రత్యర్థి అయిన బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టే ప్రయత్నం చేస్తూనే, అటు జాతీయ స్థాయిలో బీజేపీని కూడా ఈ ప్రాజెక్టు విషయంలో దోషిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు అడ్డుకునే విషయంలో అఖిలపక్ష సమావేశానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని ఆహ్వానిస్తే హాజరు కాలేదని రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ పట్ల చిత్తశుద్ధి లేదని ఆక్షేపించారు. ఈ సమావేశం జరుగుతున్నప్పుడే కేంద్రమంత్రిగా కిషన్ రెడ్డి, జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను రహస్యంగా కలవడం వెనుక మతలబేంటని ప్రశ్నలు సంధిస్తున్నారు. తెలంగాణ ప్రయోజనాలకు కిషన్ రెడ్డి ఆటంకంగా మారారన్న విమర్శలు చేశారు. మోదీ-చంద్రబాబు బంధం కోసమే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ఆంధ్రాకు వత్తాసు పలుకుతున్నట్లు రేవంత్ విమర్శలు చేశారు. తద్వారా బీజేపీ కూడా తెలంగాణ వ్యతిరేక పార్టీగా చూపించే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేయడం గమనార్హం.

### - బనకచర్ల ప్రాజెక్టుతో జగన్‌ను రాజకీయంగా దెబ్బకొట్టే వ్యూహంలో సీఎం చంద్రబాబు

తెలంగాణలో బనకచర్ల ప్రాజెక్టు రాజకీయ మంటలు రేపుతుంటే, ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ ప్రాజెక్టు రాజకీయాస్త్రంగా మారింది. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ సస్యశ్యామలంగా మారుతుందని చెబుతోన్న చంద్రబాబు, తానే రాయలసీమ పరిరక్షకుడిగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత వై.ఎస్. జగన్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్యం వహించిందని చంద్రబాబు చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు అనుమతులు పొందే విషయంలో జగన్ ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరించారన్నది ప్రధాన ఆరోపణ. జగన్ ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రయోజనాలను విస్మరించారని చెబుతున్నారు. జగన్ తన సొంత జిల్లా కడపకే ఏం చేయలేనిది, రాయలసీమ ప్రాంతానికి ఏం చేస్తారన్నది చంద్రబాబు ప్రశ్న. తద్వారా జగన్ రాయలసీమకు ద్రోహిగా జగన్‌ను ఎత్తిచూపే ప్రయత్నాలు ఈ ప్రాజెక్టు ద్వారా ప్రారంభించారు. తమ ప్రభుత్వం రాగానే రాయలసీమ ప్రయోజనాలను పరిరక్షించేందుకు బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం విషయంలో దూకుడుగా తాము ముందుకు వెళుతున్నామనే సంకేతాలు ఇచ్చేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారు.

### - ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు బనకచర్ల ప్రాజెక్టు ద్వారా ప్రయోజనాలు ఇవే

-తాము అధికారం చేపట్టగానే తెలంగాణ ప్రయోజనాలను రక్షించేందుకు బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, రాయలసీమ ప్రాంత ప్రయోజనాలను కాపాడేందుకే బనకచర్ల ప్రాజెక్టు కట్టి తీరతామని ఏపీ సీఎం చంద్రబాబు చెప్పుకుని రాజకీయంగా ప్రజల మన్ననలు పొందే అవకాశం కలిగింది.

- అధికారంలో ఉన్నప్పుడు బనకచర్ల ప్రాజెక్టుకు పచ్చ జెండా ఊపి కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాలను కాలరాసే పద్ధతిలో వ్యవహరించారని, తెలంగాణ వ్యతిరేకిగా అభివర్ణించే అవకాశం ఈ ప్రాజెక్టు కల్పించింది. కేసీఆర్‌తో ఉన్న స్నేహ బంధం వల్లే జగన్ రాయలసీమ ప్రయోజనాలు మరిచిపోయి, ఈ ప్రాజెక్టు కట్టే విషయంలో అలసత్వం ప్రదర్శించారని, రాయలసీమ ద్రోహిగా జగన్‌ను చిత్రీకరించే అవకాశం చంద్రబాబుకు ఈ ప్రాజెక్టు కల్పించింది.

- రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బనకచర్ల ప్రాజెక్టు ద్వారా తమ రాష్ట్రాల్లో సెంటిమెంట్ రేపే ఉత్ప్రేరకంగా బనకచర్ల ప్రాజెక్టు మారింది. ప్రాంతీయ సెంటిమెంట్ ద్వారా లబ్ధి పొందే అవకాశం ఇరు రాష్ట్రాల సీఎంలకు కలగడానికి కారణం బనకచర్ల ప్రాజెక్టే.

- బనకచర్ల ప్రాజెక్టుపై నిరంతరం చర్చ పెట్టడం ద్వారా అధికార పార్టీలు, ప్రతిపక్ష పార్టీలపై ప్రజలు విశ్వాసం కోల్పోయేలా చేసే అవకాశం కల్పించిందీ ప్రాజెక్టు. ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ప్రజలను తమ వైపు తిప్పుకునే అవకాశం ఈ ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలకు అవకాశం కల్పించిందనడంలో సందేహం లేదు.

- బనకచర్ల ప్రాజెక్టును రెండు రాష్ట్రాల సీఎంలు ప్రధాన రాజకీయ అంశంగా మార్చడం ద్వారా రాజకీయ అజెండాను వారే డిసైడ్ చేస్తున్నారు.

ఈ ఉచ్చులో ప్రతిపక్షాలు పడిపోవడం వల్ల పాలనా వైఫల్యాలు, హామీల అమలు వంటివి చర్చకు రాకుండా చూసే వ్యూహాన్ని అమలు చేసే అవకాశం కల్పించిందీ బనకచర్ల ప్రాజెక్టు. ఓ రకంగా చెప్పాలంటే రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీలను ఆత్మరక్షణలోకి పడవేసేలా చేసిందీ బనకచర్ల.

# ఉప్పల్ సర్కిల్లో అనుమతులకు విరుద్ధంగా భారీగా నిర్మాణాలు

- అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసిన పట్టించుకోరా.?
- టౌన్ ప్లానింగ్ అధికారుల కన్ను సైగల్లో అక్రమ నిర్మాణాలు
- అక్రమ నిర్మాణాలకు నోటీసులతో కాలయాపన
- టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతి లేకుండా కమర్షియల్ నిర్మాణాలు
- టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోరా.?


ఉప్పల్ సర్కిల్ పరిధిలో
అక్రమ నిర్మాణాలపై చర్యలేవి.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉప్పల్ సర్కిల్ అక్రమ నిర్మాణాలను జరుగుతున్నాయని టౌన్ ప్లానింగ్ అధికారులకు స్థానికులు తెలిపిన తూతూ మంత్రముగా నోటీసులు ఇచ్చి కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వాటిపై చర్యలు తీసుకోకుండా నిర్మాణాలు పూర్తి అవుతున్న అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఫిర్యాదు చేసిన అటువైపు కూడా టౌన్ ప్లానింగ్ అధికారులు చూడడం లేదని అంటే అక్రమ నిర్మాణ దారులు టౌన్ ప్లానింగ్ అధికారులకు కావలసినది ముట్ట చెపుతున్నారా.? అక్రమ నిర్మాణాలపై ఉప్పల్ సర్కిల్ ఏసిపి ముంతాజ్ బేగం చర్యలు తీసుకోకపోవడం వెనకాల ఆంతర్యం ఏమిటి.? రామంతపూర్ డివిజన్ శ్రీనగర్ కాలనీలో ఆంజనేయస్వామి గుడి ప్రక్కన ఎస్ వి గ్రామర్ స్కూల్ ప్రక్కన నిర్మిస్తున్న నిర్మాణంపై ఫిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు కాలయాపన చేస్తున్నారని, రామ్ శంకర్ నగర్, ఆర్టీసీ కాలనీ, ఇంద్ర నగర్ లో అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ ఎసిపి, సెక్షన్ ఆఫీసర్, చైన్ మాన్ కి నిర్మాణం పై ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా కావాలని కాలయాపన తో



నిర్మాణదారునికి వత్తాసు పలుకుతున్నారా.? ఉప్పల్ సర్కిల్లో అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు, కమర్షియల్ నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్నారని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న ఉప్పల్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం లేదని తూతూ మంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకులు అక్రమ నిర్మాణదారులతో చేతులు కలిపి వారి అండతో టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫోన్లు చేపించుకుంటూ అక్రమ



నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్నారని రాజకీయ నాయకుల అండదండలతో ఉప్పల్ సర్కిల్లో అక్రమ నిర్మాణాలు భారీగా జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనంగా ఉంటున్నారని వివిధ దినపత్రికల్లో



అక్రమ నిర్మాణాలపై కథనాలు ప్రచురించిన పట్టించుకోవడంలేదని ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమాలను



చేస్తున్నారని టౌన్ ప్లానింగ్ అధికారుల పై ఉన్నతాధికారులు శాఖపరమైన విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించే అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మున్సిపల్ శాఖ మంత్రి రేవంత్ రెడ్డి అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు పదేపదే తెలిపిన అధికారులు మాత్రం అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ తమ కందిన కాడికి తమ చేబుల్లో వేసుకొని అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్నారని హైకోర్టు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించొద్దని అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు తెలిపిన అధికారులు మాత్రం ఎక్కడా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భారీగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసిన ప్రజావాణిలో



ఫిర్యాదు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని అలాంటి అధికారులపై మున్సిపల్ శాఖ మంత్రి చర్యలు చేపట్టాలని, గ్రేటర్ హైదరాబాదులో



కార్పొరేటర్ల అండదండలతో ప్రతి డివిజన్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వాటి పై కార్పొరేటర్లు ఎందుకు స్పందిస్తాలేరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే కార్పొరేటర్లు వారి డివిజన్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎందుకు స్పందించరని కార్పొరేటర్ల కనుసైగల్లోనే ప్రతి అక్రమ నిర్మాణం జరుగుతుందన్నది బహిరంగ రహస్యం అలాంటి వారి పై చర్యలు చేపట్టాలని టౌన్ ప్లానింగ్ అధికారులు కార్పొరేటర్లు ఒకరికొకరు సహకారంతో వారి వారి డివిజన్లో అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారని అలాంటి కార్పొరేటర్లకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని, ఇప్పటికైన కార్పొరేటర్లు తమ వంకర బుద్ధిని మానుకొని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న అధికారుల పై బిల్డర్ల పై ఫిర్యాదు చేసి ప్రభుత్వ ఆదాయానికి మార్గాలు చూపాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన విధానంలో ఎన్నో మార్పులు తీసుకొస్తున్నారని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ రెడ్డి ముందుంటున్నారని పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో పని చేసిన అధికారుల వంకర బుద్ధి మారకపోవడంతో ఆ ప్రభుత్వంలో అనుమతులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించిన అధికారులు అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్నారా.? అలాంటి అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచారణ చేపట్టి శాఖ పరమైన చర్యలు చేపట్టాలని అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహించే అధికారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## అణచివేత అనే పదానికి నిర్వచనంగా చంద్రబాబు

దారుణంగా ఉందని లెక్కలతో వివరించారు. ఇలాంటివి అడుగుతుంటే కేసులు పెడుతున్నారని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ఆఫీస్‌లో జగన్ ప్రెస్‌మీట్ పట్టి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీతోపాటు ఆయనకు సపోర్ట్ చేసే మీడియాతో పోట్లాడుతున్నామని అన్నారు జగన్. రాష్ట్రంలో రోజురోజుకు లాండ్ ఆర్డర్ దిగజారిపోతుందని, పాలన పూర్తిగా దారి తప్పిందని ఆరోపించారు. అందుకు పల్నాడులో జరిగిన ఘటనలే ఉదాహరణలు అని అన్నారు. కూటమి ప్రభుత్వ వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తే అడుగడుగునా అడ్డుకున్నారని మండిపడ్డారు. కర్ఫ్యూలాంటి పరిస్థితుల మధ్యే తన పర్యటన సాగిందని చెప్పుకొచ్చారు. తన టూర్‌లో పాల్గొన్న వారిని బెదిరించేందుకు కేసులు పెడుతున్నారని అన్నారు. పొదిలి పర్యటన సందర్భంగా కూడా హంగామా చేశారని తమపై రాళ్లు వేసే ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు వివిధ సందర్భాల్లో మాట్లాడిన మాటలు ప్లే చేస్తూ విమర్శలు చేశారు జగన్. ప్రతిపక్షాన్ని భూస్థాపితం చేస్తారని అంటున్నారని నాలుక మందం అంటూ ఎటకారం చేస్తున్నారని అన్నారు. అందుకే ఎప్పుడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమవుతోందని అన్నారు. ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు కానీ వాటి నుంచి ప్రజలను డైవర్ట్ చేయడానికి వైసీపీ శ్రేణులు, సానుభూతిపరులపై కేసులు పెడుతున్నారని జగన్ ఆరోపించారు. తప్పుడు సాక్ష్యాలను సృష్టిస్తున్నారని అన్నారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గన్‌మెన్‌ను బెదిరించి ఆయన్ని అరెస్టు చేశారన్నారు. దీనిపై గన్‌మెన్ రాష్ట్రపతి, గవర్నర్, డీజీపీలకు లేఖలు రాసిన విషయాన్ని గుర్తు చేశారు. చెవిరెడ్డితోపాటు ఆయన కుమారుడు, పిన్నెల్లిని, నందిగం సురేష్, ఆయన భార్య, జోగి రమేష్, ఆయన కుమారుడు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డి, కొడాలి నాని, వల్లభనేని వంశీ ఇలా చాలా మందిని టార్గెట్ చేశారని అన్నారు. ఏ పాపం తెలియని కొమ్మినేనిని కూడా అరెస్టు చేశారని ఆరోపించారు. డిబెట్‌లో ఎవరో చేసిన కామెంట్స్‌కు కొమ్మినేని ఎలా బాధ్యుడు అవుతారని ప్రశ్నించారు. చివరకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటే ఆయనకు న్యాయం జరిగిందని చెప్పుకొచ్చారు. ఇది చంద్రబాబుకు చెంపపెట్టులాంటిదని అభిప్రాయపడ్డారు.

## దత్తత గ్రామాన్ని కేసీఆర్ ఆగం చేశారు

గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దత్తత తీసుకున్న వాసాలమర్రి గ్రామంలో ఈ పథకానికి శ్రీకారం చుట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. గురువారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వాసాలమర్రి గ్రామానికి చేరుకున్నారు. ఆయన వెంట భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యుడు బీర్ల ఐలయ్య, ఆలేరు శాసనసభ్యుడు అనిల్ కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన మంత్రి, స్థానికులతో ముచ్చటించారు. అనంతరం, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని మంత్రి పొంగులేటి అధికారికంగా ప్రారంభించారు. మొదటి లబ్ధిదారుగా ఎంపికైన ఆగవ్వ అనే మహిళకు ఇంటి స్థలం పట్టాతో పాటు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చే దిశగా ఈ పథకాన్ని అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలకు నాడు ఇచ్చిన హామీ ఏదీ కేసీఆర్ నెరవేర్చలేదని రాష్ట్రానికి ఈ గ్రామాన్ని రోల్ మోడల్ చేస్తాను అన్నారు, కానీ ఈ చిన్న గ్రామాన్ని ఎలాంటి పరిస్థితి తీసుకొచ్చారో చూస్తున్నాం. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామంటూ చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆ ప్రభుత్వం చేసిన అప్పులు 6 కోట్లకి పైగా వడ్డీ ఇప్పుడు కడుతున్నాం, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ నెరవేస్తున్నామని పొంగులేటి అన్నారు. వాసాలమర్రి గ్రామంలో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానికులలో హర్షాతిరేకాలు నింపింది. ఈ కార్యక్రమం ద్వారా అర్హులైన పేదలకు గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.

## ఏపీని స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు చేయూత ఇవ్వండి

వివిధ క్రీడావిభాగాల్లో అథ్లెట్లకు మద్దతు నివ్వడం స్పోర్ట్స్ సిటీ ప్రధాన లక్ష్యం.
ఆంధ్రప్రదేశ్ ను స్పోర్ట్స్ హబ్ గా మార్చడానికి సహకారం అందించండి. రాష్ట్రంలోని పాఠశాలలు, గ్రామ స్థాయి నుంచి క్రీడల అభివృద్ధికి చేయూతను అందించండి. కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన గుంటూరు సమీపాన నాగార్జున యూనివర్సిటీలో అథ్లెటిక్స్, ఆర్చరీ, వెయిట్ లిఫ్టింగ్, కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్స్ లో హాకీ, షూటింగ్ లకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ లను ఏర్పాటు చేయండి. ఖేలో ఇండియా పథకంలో క్రీడా మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 39 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 341.57 కోట్లతో ఏపీ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలకు త్వరితగతిన ఆమోదం తెలపండి. తిరుపతిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రీజనల్ సెంటర్‌ను ఏర్పాటు చేయండి. ఖేలో ఇండియాలో భాగంగా అథ్లెటిక్స్, రెజ్లింగ్ స్టేట్ లెవల్ సెంటర్‌ను తిరుపతిలో నెలకొల్పండి. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లాస్థాయి ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేయండి. దేశవ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రైల్వే స్పోర్ట్స్ కన్సెషన్ పాస్ లను మంజూరు చేయండి. ఏపీలో ఈఎస్ఐ హాస్పిటల్స్ అభివృద్ధికి సహకరించండి అని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రి మాండవీయ స్పందిస్తూ ఏపీని స్పోర్ట్స్ హబ్ గా మార్చేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. ఈఎస్ఐ హాస్పిటల్స్ సేవలను మరింత విస్తృత పరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయకు మంత్రి లోకేశ్ అందజేశారు.

## షర్మిల ఫోన్ ఎవరు టాపింగ్ చేస్తారు

**విజయవాడ :** తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కలకలం సృష్టిస్తోంది. ఈ అంశంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపుతున్నాయి. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ జరిగింది నిజమేనన్న షర్మిల.. కేసీఆర్, జగన్ కలిసే ఆ ఇన్ఫర్మేషన్‌ను షేర్ చేసుకున్నారని ఆరోపించారు. తన ఫోన్‌ను, తన భర్త ఫోన్‌ను ట్యాప్ చేశారని చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలపై మాజీ సీఎం, వైఎస్ఆర్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్ స్పందించారు. షర్మిల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై తొలిసారి స్పందించారు వైసీపీ అధినేత జగన్. వైఎస్ షర్మిల ఫోన్ ట్యాపింగ్ చేశారో.. లేదో.. తనకు తెలియదన్నారు. గతంలో తెలంగాణ రాజకీయాల్లో షర్మిల యాక్టివ్‌గా ఉన్నారు. అందుకే చేసి ఉంటారేమో అన్న అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవహారంతో తనకు సంబంధం లేదని వైఎస్ జగన్ తేల్చి చెప్పారు.

# కారు ప్రమాదంలో యువ కార్మికుడి మృతి

**- ఘటనపై కారకులపై చర్యలు...బాధితులకు నష్టపరిహారం కల్పించాలి**

**- ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు డిమాండ్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామంలో గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 25-30 ఏళ్ల మధ్య వయస్సున్న ఓ కార్మికుడు, స్థానికంగా సిమెంట్ ఇటుకల పనులు చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నాడు. నిత్యావసరాల కోసం బయటకు వెళ్లిన సమయంలో మద్యం సేవించి వాహనం నడుపుతూ వచ్చిన వ్యక్తి అతన్ని కారుతో వేగంగా ఢీకొట్టాడు. ఈ దుర్ఘటనలో కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు.మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటనను చూసిన స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.అలాగే ఆరేపల్లి సమీపంలో మరో కారు ప్రమాదం చోటుచేసుకొని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి కాలు, చేతి ఎముకలు విరిగినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు స్పందించారు. ప్రమాదాలకు కారణమైన వాహన డ్రైవర్లను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం అందించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. రుద్రవరం ఘటనలో మృతుడి కుటుంబానికి ప్రాథమికంగా రూ.2,000 ఆర్థిక సహాయం అందించి, మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలించినట్లు తెలిపారు.

# కోడెలను నిత్యం పర్యవేక్షిస్తూ.. సంరక్షించాలి

**- జిల్లా పశువైద్యాధికారి రవీందర్ రెడ్డి**

**- గోశాలలకు ఎంపిక చేసిన సిబ్బందికి అవగాహన సదస్సు**





వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన రెండు గోశాలలోని కోడెలను నూతనంగా ఎంపిక చేసిన సిబ్బంది వాటిని నిత్యం పర్యవేక్షిస్తూ సంరక్షించాలని జిల్లా పశు వైద్యాధికారి రవీందర్ రెడ్డి సూచించారు. వేములవాడలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాల, ఆలయానికి సమీపంలోని కట్టకింద గోశాలలో పనిచేసేందుకు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారిలో నుంచి పలువురిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా పశువైద్యాధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్ గురువారం అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గోశాలలో నియామకమైన సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి శ్రీధర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కోడెలు, ఆవుల సంరక్షణపై వివరించారు. ప్రతి రోజు జీవాలకు పచ్చి గడ్డి, ఎండు గడ్డి, దాణా మూడు సార్లు ఇవ్వాల్సి ఉంటుందని, వాటికి నిత్యం పరిశుభ్రమైన నీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. జీవాలు ఉండే పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వాటి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గోశాలలోని పశు వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. గోశాలలో పశు వైద్యాధికారి, సహాయకులు, అటెండర్ తదితరు అందుబాటులో ఉంటారని వెల్లడించారు గోశాలలోని జీవాలకు సీజనల్ గా అన్ని టీకాలు వేసేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతగా తమ విధులు నిర్వర్తించి జీవాలను సంరక్షించాలని స్పష్టం చేశారు.



# మేడ్చల్ కలెక్టర్ని కలిసిన మాధవరం,ముద్దం

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ సర్కార్ ఈ మధ్య జిల్లా కలెక్టర్లను బదిలీ చేసిన విషయం విదితమే!ఈ నేపథ్యంలో నిన్న గురువారం కూకట్పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ మేడ్చల్ జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎం.మను చౌదరిని మర్యదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.అలాగే ఓల్డ్ బోయిన్ పల్లి 119 డివిజన్ పరిధిలో ఉన్న బోయిన్ చెరువు కట్ట పైన డంపింగ్ యార్డ్ పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తే డివిజన్ పరిధిలో ఉన్న సుమారు లక్ష జనాభాకు న్యాయం జరుగుతుందని కలెక్టర్ ఎం.మను చౌదరికి వివరించారు.అదిగాక డివిజన్లోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులు మరుగుదొడ్లు మౌలిక సదుపాయాలుకల్పించాలని,బోయినీ చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని అలాగే స్థానికంగా నెలకొన్న పలు మౌళిక సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు.



## "రాహుల్ గాంధీ" పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే శ్రీ గణేష్

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఆయన పుట్టిన రోజు వేడుకలను రసూల్ పుర హెవెన్ ప్యాలెస్ లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో కాంగ్రెస్ శ్రేణులు అభిమానులు భారీగా పాల్గొన్నారు.ఎమ్మెల్యే శ్రీగణేష్, జిల్లా పార్టీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్,టిపిసిసి పరిశీలకులు సిద్దేశ్వర్ తో పాటు పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులు.



# బోయిన్ పల్లి ఏఎంసీలో "రాహుల్ గాంధీ"జన్మదిన వేడుకలు

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో నిన్న గురువారం ఉదయం రాహుల్ గంధీ 55వజన్మదినసందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు బోయిన్ పల్లి మార్కెట్ ఛైర్మన్ రాగిరి ఆనంద్ బాబు.ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూదేశాన్ని కాపాడేది అలాగే కాంగ్రెస్ పార్టీకి కూడా పూర్వవైభవం వచ్చే విధంగా ఆయన "జాగో భారత్ పేరుతో పాదయాత్ర నిర్వహించిన విషయం అందరికి తెలిసిందే. యువ నాయకుడు రాహుల్ గాంధీ ఈ

# బీసీ వాదానికి మద్దతివ్వకుంటే పుట్టగతులుండవ్

**బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి**

**బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



వనపర్తి (ప్రశ్న న్యూస్) దేశంలో నడుస్తున్న బీసీ వాదానికి రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వకుంటే భవిష్యత్తులో పుట్టగతులు ఉండవని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం వనపర్తి జిల్లా కొత్తకోట మండల కేంద్రంలో బీసీ కులాల ఐక్యవేదిక కన్వీనర్ రాములు యాదవ్ ఆధ్వర్యంలో విద్య, ఉద్యోగ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు రాచాల యుగంధర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై దీక్షను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో బీసీ నినాదం వచ్చినప్పుడల్లా అగ్రవర్ణ నాయకులు కుట్రలు పన్ని అణచివేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు బీసీ ఉద్యమాన్ని అడ్డుకోవాలని ప్రయత్నిస్తే అధికారం లేకుండా చేసే రోజులు వచ్చాయన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడంతోనే బీసీలు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కట్టబెట్టారని గుర్తు చేశారు.ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపామని ఊరుకుంటే సరిపోదని, బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందేవరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఒకపక్క మంత్రులు చెప్తుండగా మరోపక్క రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలు వస్తే మళ్లీ అధికారం అగ్ర కులాలదేనని బీసీలు భయాందోళన చెందుతున్నారన్నారు.

ఇచ్చిన హామీ ప్రకారం 42% రిజర్వేషన్లు అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓసీ హిందువులకు పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కల్పించినట్లుగానే బీసీ హిందువులకు రిజర్వేషన్ ఎందుకు కల్పిస్తలేరని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

సమగ్ర కులగణనకు ముందుకు వచ్చినట్లుగానే రిజర్వేషన్ బిల్లును ఆమోదించడానికి చర్యలు తీసుకోవాలని లేకుంటే ఉద్యమాలు చేయడానికి వెనుకాడేది లేదని స్పష్టం చేశారు.వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీ నాయకులారా మనకు వేదిక సిద్ధంగా ఉంది, మీరంతా కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సాగర్, బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, కొత్తకోట మండల అద్యక్షులు అంజన్న యాదవ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ప్రధాన కార్యదర్శి అస్కని రమేష్, నాయకులు శ్యాంసుందర్ గౌడ్, బుచ్చన్న సాగర్, ఎస్పీ అనిల్ కుమార్, ప్రసాద్, వెంకటన్న గౌడ్, బాలకొండయ్య, సంధ్య శ్రీను, తిరుపతయ్య గౌడ్, రాములు, మేస్త్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బడుగు,బలహీన,యువత సంక్షేమం కోసం రాహుల్ గాంధీ అలుపెరుగని పోరాటం

**- కాంగ్రెస్ పార్టీ రూరల్ మండలాధ్యక్షులు : వకులాభరణం శ్రీనివాస్**

**- రూరల్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్)వేములవాడ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు వకుళాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు కొనసాగాయి.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, "దేశ భవిష్యత్తు కోసం మతతత్వ బీజేపీ పార్టీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ గారు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు మండుటెండలో, వర్షంలో, చలిలో 4,500 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ప్రజల మధ్యకి వెళ్లిన దౌత్యవేత్త ఆయన" అని కొనియాడారు.అలాగే, దేశంలోని పేద, బడుగు, బలహీన వర్గాలు, యువత అభివృద్ధి పథంలో నడవడానికే రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. రాహుల్ గాంధీ నిండు నూరేళ్లు ఆరోగ్యంగా, సుఖంగా జీవించాలని ఆకాంక్షిస్తూ కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమినేని కర్ణాకర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్ కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేదురి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు శంకర్, రాధకృష్ణ, జాగిరి సురేష్, గణేష్, సుధీర్, గంగారాజు, పింగల్ తదితరులు పాల్గొన్నారు. మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# శీ రాజరాజేశ్వర స్వామి ఆలయ నిత్యాన్నదానానికి దాతల విరాళం అందజేత



వేములవాడ,(ప్రశ్న న్యూస్) న్యూ ఢిల్లీ లో ప్రస్తుతం నివాసముంటున్న రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని వరదవెల్లి వాస్తవ్యులైన పీచర శ్రీహర్ష, (సుప్రీంకోర్టు అడ్వకేట్)కుటుంబ సమేతంగా, వారి స్నేహితులైన శ్రీ కృష్ణ కుమార్ తో కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని గురువారం దర్శించుకున్నారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ నిత్యాన్నదానం ట్రస్టు కు పీచర శ్రీహర్ష రూ. 1 లక్ష, వారి స్నేహితులు మరొక సుప్రీంకోర్టు అడ్వకేట్ శ్రీ కృష్ణ రూ.1 లక్ష విరాళం గా పరిపాలన విభాగం సహాయ కార్యనిర్వహణాధికారి శ్రవణ్ కు చ్చెక్కు రూపంలో అందజేశారు.

# విద్యతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలి

**- క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి దోహదపడుతాయి**

**- లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ శాతవాహన అధ్యక్షులు మానువాడ శంకర్**

**- విద్యార్థులకు "టీ షర్టులు" పంపిణీ**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలంలోని అనుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో కబడ్డీ,ఖోఖో ఆటలలో పాల్గొనే విద్యార్థులకు ప్రత్యేక టీ షర్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విట్టల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన అధ్యక్షులు మానువాడ శంకర్ మాట్లాడుతూ "విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహ దారుఢ్యానికి దోహదపడుతాయని అన్నారు. టీ షర్టను ప్రోత్సాహంగా భావించి, క్రీడా పోటీలలో విజయాలు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తమకిచ్చిన గుర్తింపుకు హర్షం వ్యక్తం చేస్తూ, ఆటల్లో మంచి ప్రతిభ కనబరిచి పేరు తెచ్చుకుంటామని ముక్త కంఠంతో వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, దేవేందర్, కామణి రవీందర్, రమేష్, పీఈటీ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

# జవాన్ అభినవ్ యువతకు ఎంతో ఆదర్శం

**"ఆపరేషన్ సింధూర్"లో పాల్గొన్న జవాన్ అభినవ్‌ను సత్కరించిన చల్మెడ**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్ మండలం, భూషణ్ రావుపేటకు చెందిన సీనియర్ జర్నలిస్టు కరుణాకర్ కుమారుడు బెజ్జంకి అభినవ్ ఇటీవల జరిగిన "ఆపరేషన్ సింధూర్" యుద్ధంలో పాల్గొని జవాన్‌గా సేవలందించారు. దేశ సేవలో భాగంగా చిన్న వయసులోనే ఆర్మీలో చేరి బాధ్యతల్ని నిర్వహించిన అభినవ్‌ను బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గురువారం ప్రత్యేకంగా సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా అభినవ్ ధైర్యం,దేశ భక్తిని ప్రశంసించిన చల్మెడ, యువతకు ఆయన ప్రేరణగా నిలుస్తారని పేర్కొన్నారు. అభినవ్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో నాయకులు మామిడిపల్లి రవి,జలంధర్, భూమ్ రెడ్డి,గంగప్రసాద్, లింబ్రాద్రి తదితరులు పాల్గొన్నారు.

# గూడెంలో ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు




కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ 54వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణ కన్వీనర్ మొహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగ సీతారాములు హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ "రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నిరంతరం పోరాడుతున్న నాయకుడు. దేశంలో ఐక్యత, సామాజిక న్యాయం, యువత భవిష్యత్తు కోసం ఆయన చేస్తున్న కృషి ఆదర్శనీయమైనది. భారత్ జోడో యాత్ర ద్వారా ఆయన దేశ ప్రజల హృదయాలను గెలుచుకున్నారు. త్వరలోనే కాంగ్రెస్ పునర్వైభవం సాధించి దేశానికి గౌరవం తీసుకొస్తుంది" అని అన్నారు. ఈ వేడుకల్లో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాహుల్ గాంధీ దీర్ఘాయుష్మడిగా ఉండాలని ఆకాంక్షిస్తూ నాగ సీతారాములు, అల్లాడి నరసింహారావు, ఆదరి కొమరయ్య, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం రాజశేఖర్, షేక్ నయీమ్, ఎం.ఎ. రజాక్, కాసుల వెంకట్, మద శ్రీ రాములు, షేక్ అబ్దుల్ సలాం, షేక్ నీసర్, తంగేళ్ళ లక్ష్మణ్, పల్లపు లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ భద్రం, బొబ్బాల.వెంకట్ యాదవ్, దావుద్, ఉస్మన్, బానోత్.కోటేష్, సంగు యాలాద్రి, తదితరులు పాల్గొన్నారు

# మేడ్చల్ రైతులకు రైతు భరోసా నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి

### జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేత



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా రైతులకు రైతు భరోసా నిధులు రావడంలేదని, మేడ్చల్ రైతులకు సైతం రైతు భరోసా నిధులు ఇవ్వాలని కోరుతూ పి ఎసి ఎస్ చైర్మన్లు, ఎఫ్ ఎ సి ఎస్ చైర్మన్లు జిల్లా కలెక్టర్ కు, జిల్లా వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం రైతు భరోసా నిధులను ఇతర ప్రాంతాల రైతుల అకౌంట్లో వేస్తున్నారు కానీ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని ఏ ఒక్క రైతు అకౌంట్లో రైతు భరోసా నిధులను జమ కావడంలేదని పి ఎ సి ఎస్, ఎఫ్ ఎసి ఎస్ చైర్మన్లు ఆరోపించారు. ప్రతి జిల్లాలో రెండు విడతలు రైతు భరోసా నిధులు విడుదల చేశారని, మేడ్చల్ జిల్లాలో మాత్రం ఒక్కసారి కూడా రైతు భరోసా నిధులు జమకాలేదని తెలిపారు. అంతేకాకుండా గతంలో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం సగం రైతుల రుణమాఫీ చేసి మిగతా సగం రైతుల యొక్క రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. మిగిలిన రైతులను పూర్తిగా రుణమాఫీ చేయాలని కోరారు. మేడ్చల్ జిల్లాలో వరి ధాన్యం పండించలేరా..మేడ్చల్ జిల్లాలో రైతులు లేరా మేడ్చల్ జిల్లా తెలంగాణలో లేదా... ఎందుకు ఇంత పక్షపాతం అంటూ ప్రశ్నించారు. గతంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పార్లమెంట్ సభ్యులుగా గెలిపించిన ప్రజలు అదే ఈ రోజు మిమ్మల్ని పీసీసీ ప్రెసిడెంట్ స్థాయికి ముఖ్యమంత్రి స్థాయికి తీసుకెళ్లడం జరిగింది, ఆ స్థాయికి తీసుకెళ్లిన మేడ్చల్ మల్కాజ్గిరి రైతులను మరిచిపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను గుర్తుపెట్టుకుని ప్రతి ఒక్క రైతు అకౌంట్లో రైతు భరోసా వెయ్యాలని పార్టీలకు అతీతంగా రైతుల తరఫున కోరుతున్నామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో రైతుల్లో అకౌంట్లో డబ్బులు వెయ్యని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని పిఎసిఎస్ షామీర్పేట్ చైర్మన్ మధుకర్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ డబ్బిల్ పూర్ సురేష్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ ,బోరంపేట్ బాల్ రెడ్డి,పి ఎస్ ఏ చైర్మన్ మేడ్చల్ రందీప్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ కీసర ప్రభాకర్ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్,పూడూరు చైర్మన్ సుధాకర్ రెడ్డి తెలిపారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని 4వ వార్డులో కిష్టాపూర్ లోని వీకర్ సెక్షన్ కాలనీ, అర్చన కాలనీలో రూ.37.50 లక్షల సిఅండ్ఐజిఆర్ఎస్ నిధులతో నూతనంగా నిర్మించనున్న పలు సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ త్రిసభ్య కమిటీ సభ్యులు రెడ్డంగారి నవీన్ రెడ్డి, మేడ్చల్ పురపాలక మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్, మేడ్చల్ పురపాలక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మండల అధ్యక్షులు గోమారం రమణారెడ్డిలు స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. కిష్టాపూర్ వీకర్ సెక్షన్ కాలనీలో రూ.16 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు అర్చన కాలనీలో రూ.16.75 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు, కిష్టాపూర్ గ్రామ పరిధిలో రూ.4.75 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సీసీ రోడ్డు నిర్మాణ పనులు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో పూడూరు ఎఫ్ఎసిఎస్ డైరెక్టర్ వేముల సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తొంట యాదయ్య, ప్రభు, తొంట సుధాకర్, అర్చన కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ చారి, కాలనీవాసులు కమలాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, గంగయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, హనుమంత రెడ్డి, సత్యనారాయణ, మల్లారెడ్డి, వేముల రంజిత్ రెడ్డి తదితరులు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక అడ్డంకి -ఒక్కో ఇంటికి రూ.2 లక్షల అదనపు భారం!

- **ఇసుక మాఫియాలో ఇరుక్కున్న ఇందిరమ్మ కలలు**
- **జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలి**
- **అధిక ధరలకు విక్రయిస్తున్న దళాలరులపై చర్యలు తీసుకోవాలి**
- **విలాసాగర్ గ్రామ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు**

బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఇసుక కొరత పెనుదెబ్బగా మారింది. నిర్మాణానికి అవసరమైన ఇసుక అందకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.దీనిని ఆసరా చేసుకున్న దళారులు, అక్రమదారులు టన్ను ఇసుక ధరను వేగంగా పెంచారు. ప్రస్తుతం ఒక్కో ట్రాక్టర్ ఇసుక ధర రూ.3,000 నుంచి రూ.4,000 వరకు చేరడంతో ప్రతీ లబ్ధిదారుడిపై రూ.2 లక్షల వరకు అదనపు భారం పడుతోంది.బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ గ్రామంలో ఇళ్లు లేని స్థలం ఉన్న 72 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి.చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతులమీదుగా అనుమతి పత్రాలు అందించి నిర్మాణాలు ప్రారంభించారు. ప్రతి ఇంటికి రూ.5 లక్షలు మంజూరు చేసినా,నిర్మాణ సామాగ్రి ధరలు పెరగడం, అందుబాటులో లేకపోవడంతో పనులు ఆగిపోయాయి.

**- ఇసుక మాఫియా వేధింపులు**

ఇసుక కొరతను ఆసరా చేసుకొని అక్రమ ఇసుక వ్యాపారులు ఇష్టారీతిగా ధరలు నిర్ణయిస్తూ లబ్ధిదారులను వేధిస్తున్నారు. ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీ పట్ల అవగాహన లేకపోవడం, నియంత్రణ లేమి వల్ల లబ్ధిదారులు ప్రైవేటు వారివైపు మొగ్గుచూపే పరిస్థితి నెలకొంది.



**- లబ్ధిదారుల డిమాండ్లు**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి,

ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన ఇసుకను ఉచితంగా సరఫరా చేయాలి.

– వారంలో కనీసం మూడు రోజులు వెబ్ బిల్లులకు అనుమతులు ఇవ్వాలి.

– ఇసుక, బెండడి, కంకర, ఇటుకను అధిక ధరలకు అమ్ముతున్న అక్రమ దళారులపై చర్యలు తీసుకోవాలి.

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ఆశలు పెట్టుకున్న నిరుపేద ప్రజలు ఈ అక్రమ దందా మాఫియాను నియంత్రించకపోతే, ఇందిరమ్మ కలలు భగ్నం అవుతాయన్న

# పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) లోక్ సభ ఫ్లోర్ లీడర్, కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు రాహుల్ గాంధీ జన్మదినం వేడుకలు కొత్తగూడెం విద్యానగర్ లోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి హాజరైన మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్, రైల్వే బోర్డు సభ్యులు వై శ్రీనివాస్ రెడ్డి, పెదబాబు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సందర్భంగా భారత దేశ భవిష్యత్ ఆశా జ్యోతి రాహుల్ గాంధీ అని, త్యాగాల కుటుంబం నుండి వచ్చిన నాయకుడు ప్రధాన మంత్రి పదవి అవకాశం వచ్చినా దేశం కోసం పార్టీ కోసం పనిచేస్తున్నారనీ పేర్కొన్నారు. దేశంలో ఇందిరమ్మ ఇళ్లు లేని ఊరు లేదని, ప్రతిపక్ష నాయకుడుగా, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగడుతూ రాహుల్ గాంధీ ప్రజల ఆశాజ్యోతిగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర ద్వారా దేశ ఐక్యత కోసం అసాధారణ కృషి చేశారని ప్రశంసించారు. ఎండ, వాన, చలిని లెక్కచేయకుండా సుమారు 4000 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేసిన రాహుల్ నాయకత్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు.



ఈ యాత్ర దేశంలోని వివిధ వర్గాల ప్రజలను ఒకతాటిపైకి తెచ్చిందని, రాహుల్ నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంత్ రావు, టెలికాం బోర్డు సభ్యులు బోదాసు కనకరాజు, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, కాంగ్రెస్ నాయకులు బాలపాసి, సుజాతనగర్ పార్టీ అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ తలుగు అనిల్, రావి రాంబాబు, ఆకునూరి కనకరాజు, గొల్ల శ్రీను, జానీ భాయ్, పోస్ట్ ఆఫీస్ వాసు, మహిళ నాయకులు హైమవతి, జోగు రమాదేవి, ఆకునూరి సుప్రియ, కాశబోయిన గాయత్రి యూత్ కాంగ్రెస్ శ్రేణులు గులాం మతిన్, రామ్మూర్తి, ప్రణయ్, పవన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# "ముద్దం" నేను యుద్దానికి సిద్దం: ఏనుగుల తిరుపతి.

- **బోయిన్ పల్లి డివిజన్ లో అభివృద్ధి పై గత పదిహేను ఏళ్ళ శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న బిజెపి నాయకుడు ఏనుగుల తిరుపతి.**
- **స్థాయి మరిచి విరుచుకుపడితే, నిజాలు సమాధి చేయలేరు! - "15"ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఆయన నేర్చుకుంది ఇంతేనా**
- **తెలంగాణ ఉద్యమకారుడిలా,భాజపా బాధ్యత గల నాయకుడులా ప్రజా క్షేత్రంలో ఉన్నాను తిరుపతి.**
- **బోయిన్ పల్లి డివిజన్ ప్రజల నుంచి సుమారు 25 కోట్ల రూపాయలు ఆస్తి పన్ను ఏటా వసూలు అవుతుంది.కానీ అభివృద్ధి శూన్యం ?**
- **వ్యక్తిగత దూషనలతో దూకుడు మాని,డివిజన్ పై ఫోకస్ చేస్తే బాగుంటుంది.**




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కూకట్పల్లి నియోజకవర్గంలో ఉన్న డివిజన్లల్లో కీలకంతో పాటు గెలుపు,ఓటమిలకు వేదిక ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్.గత కొన్ని రోజులుగా బిఆర్ఎస్ వర్సెస్ బిజెపి మాటలు తూటాల్లా పేల్చుతున్నారు. ఈ నేపథ్యంలో బోయిన్ పల్లి డివిజన్ లో ఉన్న భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో గత కొన్నాళ్ళుగా పాలన పడకేసిందని భాజపా నాయకుడు తిరుపతి యాదవ్ విమర్శించారు.స్థానిక కార్పొరేటర్ ప్రజల బాగోగులు పట్టించుకోకపోవడంతో ఓల్డ్ బోయిన్ పిల్లి డివిజన్ సమస్యల వలయంలో చిక్కుకున్నట్లేనని అయన తెలిపారు.అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అందించడం చేతకాక 15 ఏళ్లుగా కార్పొరేటర్ గా సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తని పూర్తిగా తేలిపోయాడని, నిన్న విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పక, స్థాయి మరిచి వ్యక్తి గత దూషనలకు దిగడం దురదృష్టకరం. అలాగే ఓల్డ్ బోయిన్ పిల్లి డివిజన్ ప్రాంత ప్రజలే బాహాటంగా చెబుతున్నట్లు ఆయన తెలిపారు.కార్పొరేటర్ గా విఫలమై ప్రజల ఆదరణ కోల్పోయిన నాయకుడిగా ఆగ్రహానికి లోనై దిగజారి మాట్లాడుతున్నారని అన్నారు. రాజకీయ ప్రత్యర్థిగా ఉన్న తనను తక్కువ చేసి మాట్లాడడం,దిగజారే విధంగా వ్యవహరించడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో తిరుపతి యాదవ్ స్పష్టం చేశారు.భారతీయ జనతా పార్టీ ప్రపంచలోనే అత్యధికంగా సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీగా నిలిచిందని ప్రస్తుతం భారసా పరిస్థితి మునిగే "నావ లాగా" తయారయిందని ఎద్దేవా చేశారు.బిఆర్ఎస్ పార్టీ దయనీయ పరిస్థితికి తోడు డివిజన్లో అభివృద్ధి పనులు జరగక సమస్యలు ఎక్కువకావడంతో కార్పొరేటర్ ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నట్లు పేర్కొన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నోచుకోని పరిస్థితి డివిజన్లో నెలకొందని బిజెపి తరఫున ఈ అంశాన్ని లేవనెత్తడంతో హుటాహుటిన కార్పొరేటర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు 100 పడగల ఆసుపత్రికి కేటాయించాలని నిన్న ఎమ్మెల్యే తో పాటు ఆయన మేడ్చల్ కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ఎం.మను చౌదరిను కలవడం బిజెపి విజయానికి తొలి మెట్టని అన్నారు.కార్పొరేటర్ మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రాజకీయాలలో విమర్శలు ప్రతి విమర్శలు ఉంటాయి తప్ప వ్యక్తిగత విమర్శలకు తావుండదని హితవు పలికారు.డివిజన్లోని వివిధ సమస్యలు తన దృష్టికి వస్తున్నాయని డ్రైనేజీ సమస్యలతో పాటు ఓపెన్ మ్యాన్ హోల్స్,



20 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు ఇప్పటికీ కొన్ని కాలనీలలో అలాగే ఉన్నాయని వీళ్ళేమో అభివృద్ధి చేశామని ప్రగల్భాలు పలుకుతూ అవాకులు చివాకులు పేల్చడం సిగ్గుచేటని అన్నారు. కార్పొరేటర్ తన స్థాయికి తగ్గట్టు హుందాగా మాట్లాడి రాజకీయాలలో నైతిక విలువలను పెంచుకుంటే బాగుంటుందని అన్నారు. అదిగాక బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో ఉన్న విఠల్ ఎన్ క్లూవ్ లో 2002లో కూకట్పల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నప్పుడు వేసిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థనే ప్రజలు ఉపయోగించుకుంటున్నారు.

కానీ ఇప్పటి వరకు కొత్త భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పై ఫోకస్ చేయకపోవడం గమనార్హం.స్థానికంగా మున్సిపల్ కార్పొరేషన్ కుసుమారు ఇరవై ఐదు కోట్లు ట్యాక్స్ రూపంలో వసూలు అయితున్న కూడా అభివృద్ధి మాత్రం ఆమడ దూరంలో ఉంది.మరో ఆశ్చర్య పోయే విషయం ఏమిటంటే గత రెండేళ్ల క్రితం హరిజన బస్తీలో "30"లక్షల రూపాయలతో "సామాజి కభవనం"కడుతున్నట్లు శిలాఫలకం వేసిన ఇప్పటి వరకు ఎలాంటి పనులు చేయలేదని హరిజన బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారని ఆయన వివరించారు.

ఇలా ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదుల సంఖ్యలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని తిరుపతి మరోసారి స్పష్టం చేశారు.

## నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే ఛీటింగ్ కేసులు: ఎస్పి అశోక్ కుమార్

-వాహనాల నెంబర్ ప్లేట్స్ నిబంధనల ప్రకారం బిగించు కోవాలి
-నెంబర్ ప్లేట్ లేని వాహనాలను ఉపయోగించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న దృష్ట్యా ఈ తనిఖీలు
-నెంబర్ ప్లేట్స్ సరిగా లేని 306 వాహనాలను సీజ్



జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ నంబర్ లేని, నంబర్ ప్లేట్ దాచి,కొన్ని నంబర్లు తొలగించిన వాహనాలను గుర్తించేందుకు పోలీస్ అధికారులు ,సిబ్బంది వివిధ టీంలు గా ఏర్పడి ఏక కాలంలో ముమ్మర తనిఖీ లు చేసారని తెలిపారు. వాహనాల తనిఖీ చేయగా ఇందులో సరైన నెంబర్ ప్లేట్స్ లేని 306 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. నెంబర్ ప్లేట్స్ సరిగా లేని వాహనాలను, నెంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి వాటికి సరైన నెంబర్ ప్లేట్లను బిగించిన తర్వాత వాహనాలను విడిచి పెట్టడం జరిగిందని తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా , ఇష్టారీతిన వాహన నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేయడం కొందరు వాహనదారులు ట్రాఫిక్ ఈ చలాన్ నుంచి తప్పించుకోవడం కోసం వాహనాలపై ఫ్యాన్సీ నంబర్ తో పాటు తప్పుడు నంబర్ లు సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. ఆయా నంబర్ ప్లేట్లపై వివిధ ఆకారాలు, డిజైన్లు, పదాలు, అక్ష రాలు గుర్తించలేనంతగా ఉంటున్నాయి. కొందరు కావాలనే వాటిని తొలగించడం, నంబర్ గుర్తించకుండా నెంబర్ ప్లేట్ విరగ్గొట్టడం చేస్తున్నారు. ఇలాంటి వారు వాహన తనిఖీల్లో పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కావున జిల్లా పరిదిలోని ప్రజలు అందరు పోలీస్ వారికీ సహకరించి తమ వాహనాల నెంబర్ ప్లేట్స్ నిబందనల ప్రకారం బిగించు కోవాలని, లేని పక్షం లో వాహనాలపై నంబర్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసి వాహనం నడిపితే వాహనదారుడి పై ఛీటింగ్ కేసులను నమోదు చేయబడుతాయని ఎస్పి వాహనదారులకు సూచించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలను ఉపయోగించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న దృష్ట్యా ఈ యొక్క తనిఖీలు నిరంతర నిర్వహించడం జరుగుతుందని కావున జిల్లా పరిదిలోని ప్రజలు అందరు పోలీస్ వారికీ సహకరించలని కోరారు.

## 888 జి.ఓ సవరణకు తక్షణ చర్యలు తీసుకోవాలి

- రాజన్నాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి
- రాజన్నాలయ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు : అప్పాల కిషన్ చంద్
- రాజన్నాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు : కూరగాయల శ్రీనివాస్
- టీఎన్జీఓ నేతల దృష్టికి రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం వినతిపత్రం అందజేత



వేములవాడ,(ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మేజర్ టెంపుల్ జెఎస్ఈ సమావేశంలో రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం కీలక నిర్ణయాలు తీసుకుంది. సంఘం గౌరవాధ్యక్షులు అప్పాల కిషన్ చంద్, అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్ ల నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర టీఎన్జీఓ అధ్యక్ష , కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్లకు సమస్యల నివేదికను అందజేశారు.

**- ప్రస్తావించిన ప్రధాన అంశాలు ఇవే**

**- 261 జి.ఓ సవరణ అవసరం**

అర్చకుల స్కేల్ పై ఉన్న జి.ఓ 261 లో ఇప్పటివరకు ఒక్కసారి కూడా మార్పు జరగలేదని, అనుభవజ్ఞులైన అర్చకులతో కమిటీ ఏర్పాటు చేసి సవరణ జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

**- లాస్ట్ గ్రేడ్ ఉద్యోగుల సమస్యలు**

వేర్వేరు ఆలయాల్లో వేర్వేరు విధానాలు అమలవుతుండడంతో పదోన్నతుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని,888 జి.ఓలో సవరణ చేసి ఫీడర్ క్యాడర్ వ్యవస్థను స్పష్టంగా ఉంచాలన్నారు.

**- సామాన్య బదిలీల్లో అన్యాయం**

ఆరోగ్య కారణాలతో తాత్కాలిక బదిలీకి వెళ్ళిన సిబ్బందిని మాతృ సంస్థలకు తిరిగి పంపే ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. కొందరు ఉద్యోగులు డిప్యూటీ స్థాయికి పదోన్నతి పొందినా, తమ పాత చోటే పనులు చేస్తూ కొత్త పోస్టుల్లో నియామకం జరగకపోవడం వల్ల పరిపాలనలో అంతరాయం ఏర్పడిందన్నారు.

**- పోస్టుల భర్తీ అత్యవసరం**

14 మంది పర్యవేక్షకులు ఉండవలసిన చోట కేవలం ఆరుగురు మాత్రమే పనిచేస్తుండటంతో ఆలయ నిర్వహణపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

**- 888 జి.ఓలో సమకాలీన మార్పులు అవసరం**

ఈ ఉత్తర్వులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే సవరించినట్లు పేర్కొంటూ, తెలంగాణ ప్రభుత్వం కూడా చురుగ్గా స్పందించి ముఖ్య దేవస్థానాల యూనియన్లతో చర్చించి సవరణలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పలు ఆలయాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను పాలకులు పరిగణనలోకి తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని సమావేశం తీర్మానించింది.

## జర్నలిస్టు నాగేశ్వర వరప్రసాద్ కు చల్మెడ పరామర్శ



వేములవాడ, (ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం,కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయులు నాగేశ్వర వరప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు గురువారం పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని వైద్యులను అడిగి తెలుసుకొని,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి,ధైర్యాన్ని కల్పించారు.పరామర్శలో వారి వెంట నాయకులు మామిడిపల్లి రవి, జలంధర్, భూమ రెడ్డి, లింబాద్రి, కరుణాకర్, గంగప్రసాద్ తదితరులు ఉన్నారు.

# ప్రధాన దేవాలయ ఉద్యోగుల జేఏసీ సమావేశం





యాదగిరిగుట్ట (ప్రశ్న న్యూస్) యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లోని పాత గోశాలలో గల ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది.సమావేశంలో ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సమస్యల పై చర్చించారు ఉద్యోగులు.దేవాలయాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్చించి సమస్యలపై ఎజెండా రూపొందించారు.ప్రధాన దేవాలయాల ఉద్యోగులకు హెల్త్ కార్డులు,పిఆర్సీ అనుమతించి రాబోవు ప్రభుత్వ జీవో నందు ప్రత్యేకంగా పొందుపరుచాలి.జీవో 888 ను దేవాలయలలో ఉన్న పోస్టులకు అనుగుణంగా పూర్తి స్థాయిలో సవరణ చేయాలి జీవో 222 సవరణ చేయాలి.పదవి విరమణ దగ్గరలో ఉన్న ఉద్యోగులను మరియు అనారోగ్యంతో ఉన్న ఉద్యోగులను మానవతా దృక్పథంతో వారి వారి మాతృ సంస్థలకు బదిలీ/డిప్యుటేషన్ చేయాలి.ప్రధాన దేవాలయాల్లో పని భారం తగ్గించుటకు అవసరం మేరకు క్యాడర్ స్ట్రెంత్ ను అనుమతిస్తూ క్యాడర్ స్ట్రెంత్ లో ఖాళీగా ఉన్న పోస్టులు రెగ్యులర్ పద్ధతిన నియామకం చేయాలి.సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలనే అంశాలతో పాటు పలు అంశాలతో కూడిన ఎజెండా తయారు చేశారు.ఎజెండాలోని ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిని కలసి విన్నవించుకోవడానికి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ..సమావేశంలో రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్ బాబు,టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీష్,టీఎన్జీవోస్ యూనియన్ కార్యవరం,టీఎన్జీవోస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు,తదితరులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ మాదిగ తో ఆత్మీయ సన్మాన సభ



నాచారం (ప్రశ్న న్యూస్) పద్మశ్రీ పురస్కారం వచ్చిన సందర్భంగా ప్రజా నాయకుడు మంద కృష్ణ మాదిగ కి వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నాగోల్ శుభం కన్వెన్షన్ హాల్ లో ఆత్మీయ సన్మాన సభ జరిగింది.ఈ కార్యక్రమంలో ఎమ్మెర్పీ జాతీయ నాయకులూ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ జాతీయ నాయకులు మేడ్చల్ జిల్లా ఎమ్మెర్పీ అధ్యక్షులు కేశాపగా రాంచందర్ మాదిగ , మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ , సీనియర్ నాయకులు కోరిపాక అంజి మాదిగ , సిల్వేరు శ్రీనివాస్ మాదిగ , రసమల్ల యాదగిరి మాదిగ ,శివ మాదిగ , రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాల్లో రూ. 43 కోట్ల రైతు భరోసా నిధులు జమ

76,974 మంది జిల్లా రైతులకు లబ్ధి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) జిల్లాలోని అన్నదాతలకు రైతు భరోసా కింద రెండు రోజుల్లో రూ. 43 కోట్లకు పైగా డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. ఖరీఫ్ సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. మంగళవారం వరకు జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 76,974 మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.43,22,42,859 డబ్బులు జమ అయ్యాయని తెలియజేశారు.

## బంగారు భవిష్యత్తుకు చదివే ముఖ్యం

చిన్నారులను బడిలో చేర్పించిన మాజీ జెడ్పిటిసి లక్ష్మణ్ రావు



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) తన వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీ పిల్లలను చదివించేందుకు మాజీ జెడ్పిటిసి చీటీ లక్ష్మణ్ రావు భరోసా ఇచ్చాడు. వివరాల్లోకి వెళితే మహారాష్ట్ర చెందిన లచ్చయ్య కట్టెల గత కొంతకాలంగా లక్ష్మణ్ రావు వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ కూలిగా పనిచేస్తున్నాడు. ఇటీవల తన పిల్లలు అవంతి లచ్చన్న కట్టెల, ఆదర్శ హరిదాసు నగర్ లో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చారు. వారిద్దరిని చూసిన లక్ష్మణ్ రావు వారిద్దరిని చదువు కోవాలని సూచించాడు. వారిని వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఇద్దరి చదువుకు అయ్యే పూర్తి ఖర్చులు తనే భరిస్తానని హామీ ఇచ్చారు. చదువు విలువ తెలిసి కూలీల పిల్లలను బడిలో చేర్పించిన మాజీ జడ్పిటిసి లక్ష్మణ్ రావు పలువురు అభినందించారు.

## డ్రగ్స్, గంజాయి నివారణలో విద్యార్థులు,యువత భాగస్వాములు కావాలి



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లా వ్యాప్తంగా పాఠశాల,కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వలన కలుగు అనర్థాలపై రేపటి నుండి వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఆంటీ నార్కోటిక్స్ బ్యూరో ద్వారా జిల్లా వ్యాప్తంగా పాఠశాల, కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందనిఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత కు డ్రగ్ అవర్నెస్ వీక్ లో బాగంగా రేపటి నుండి వారం రోజుల పాటుగా ప్రతి పోలీస్ స్టేషన్లలో మత్తు పదార్థాల వలన కలుగు అనర్థాలపై వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించనున్నారు.

1. జిల్లా, మండల కమిటీ సమావేశం(20.06)
2. అంతర్జాతీయ యోగా దినోత్సవం(21.06)
3. డ్రగ్ హాట్ స్పాట్ లలో అవగాహన కార్యక్రమం(22.06)
4. మొక్కలు నాటడం(23.06)
5. స్లోగన్ రైటింగ్ కాంపిటీషన్(24.06)
6. పెయింటింగ్ కాంపిటీషన్(25.06)
7. అంతర్జాతీయ మాదక ద్రవ్య సేవన వ్యతిరేక దినోత్సవం , ర్యాలీ, ప్రతిజ్ఞ, సమావేశం(26.06)

డ్రగ్స్ నిర్మూలనకోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యమై డ్రగ్స్ మహమ్మరిని నిర్మూలించి భావితరాలకు మంచి భవిష్యత్ అందించాలని, యువత , విద్యార్థులు మత్తు పదార్థాలకు, గంజాయికి దూరంగా ఉంటూ భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండాలన్నారు.

## ప్రతి రోజు యోగా సాధనతో ఆరోగ్యం

యోగా శిక్షకులు శ్రీనివాస్, స్వప్న
ఐడీఓసీలో దశాబ్ది ఉత్సవాలు



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) నిత్యం యోగా సాధనతో ఆరోగ్యంగా ఉంటారని ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు బీ శ్రీనివాస్ టీ స్వప్నపేర్కొన్నారు. అంతర్జాతీయ యోగ దశాబ్ది ఉత్సవాలు కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఉదయం కామన్ యోగా ప్రోటోకాల్ పై జిల్లా అధికారులు, సిబ్బందికి ఆయుష్ యునాని డిస్పెన్సరీ యోగా శిక్షకులు బి శ్రీనివాస్ టి స్వప్న యోగ ఆసనాల పై అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా యోగా ఆసనాలు, ప్రాణాయామం ముద్రలు ధ్యానము తదితర అంశాలపై వివరిస్తూ..చేయించారుప్రతి రోజు యోగా చేయడం వలన కలిగే లాభాలు, ఆరోగ్యం ఆనందం ఎలా పొందవచ్చు వంటి వివరాలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు , సిబ్బంది, కలెక్టరేట్ కార్యాలయ ఏవో రామ్ రెడ్డి, ఆయుష్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శశి ప్రభ, డాక్టర్ సౌమిని, డాక్టర్ శ్వేత, డాక్టర్ స్వరూప ,డాక్టర్ కళ్యాణి, డీపీఎం తిరుపతి ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

- రాహుల్ గాంధీ మంచి విజన్ ఉన్న నాయకుడు
- నిన్నటి త్యాగాలకు వారసుడు రేపటి తరానికి మార్గదర్శకులు
- దేశ ప్రజల తరపున ప్రశ్నించే ఏకైక గొంతుక



**ఎమ్మిగనూరు** ఎమ్మిగనూరు పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం కాసిం వలి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ గారి 55వ పుట్టినరోజు సందర్భంగా స్థానిక ఉర్దూ పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతు రాహుల్ గాంధీ గారు మంచి విజన్ ఉన్న నాయకుడు,యువతకు ఆదర్శం,నిరంతరం దేశప్రజాసామ్యాలపై పోరాడుతూనే ఉంటాడు,కాంగ్రెస్ పార్టీ కి ఆశకిరణం,ధృవ తార అని,రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రి నీ చేసెంతవరకు వై యస్ షర్మిల రెడ్డి నేత్రత్వం లో అహర్నిశలు పనిచేస్తామన్నారు. ఈ దేశంలో అన్ని సామాజిక వర్గాలకు సామాజిక న్యాయం జరగాలని పోరాడుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు దేశంలో పేదరికం రోజుకు రోజుకు పెరిగిపోతుందని ఆ పేదరిక నిర్మూలన జరగాలంటే దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది అని అన్నారు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇలాంటి వృద్ధాశ్రమాలు నడుపుతున్నటువంటి ఎంతోమంది మానవత్వంతో ట్రస్టులు నడుపుతుంటే వాటికి నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఉదాహరణకు ఆర్డిటి ద్వారా ఎంతోమంది నిరుపేదలకు ఇల్లు లేని వారికి ఇల్లు కట్టిస్తున్నారు వైద్యం అందలేని వారికి వైద్యం అందిస్తున్నారు నిరుపేదలు చదువు లేని వారికి చదువు అందిస్తున్నారు

మరి అలాంటి ఆర్డిటి సంస్థలనే నిధులు రాకుండా అడ్డుకుంటున్నారంటే ఇది చాలా బాధాకరమైన విషయం వెంటనే ప్రతి పేదవానికి ఆదుకునేటువంటి ఆర్ డి టి సంస్థకు నిధులు వచ్చే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమములో ఔజఎ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆసిఫ్ ,నరసప్ప ,షబ్బీర్, లోకేష్, అజయ్ భాస్కర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## మస్కట్లో చిక్కుకుపోయిన మహిళను సురక్షితంగా చేర్చిన నంద్యాల పోలీసులు

**నంద్యాల** కొద్ది రోజుల క్రితం, నంద్యాల జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అధి రాజ్ సింగ్ రానా కు మస్కట్లో ఉన్న చాగలమర్రి గ్రామానికి చెందిన హుస్సైనమ్మ అనే మహిళ ఒక సెల్ఫీ వీడియోను పంపింది. ఆ వీడియోలో ఆమె తీవ్రమైన మనస్తాపంతో తాను ఇక బతకలేనని, తనను కాపాడాలని ఎస్పీ అల్లగడ్డ పోలీసులను అప్రమత్తం చేసి, ఆమెకు సంబంధించిన వివరాలు సేకరించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అల్లగడ్డ పోలీసులు చేపట్టిన విచారణలో, హుస్సైనమ్మ భర్త 2024లో మరణించడంతో కుటుంబ ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఆమె మస్కట్ వెళ్లినట్టు తెలిసింది. మొదట ఆమె ఓ ఇంట్లో మెయిడ్ గా పనిచేశారు. అయితే ఆ ఇంట్లో వంట చేస్తుండగా ఆమె నైటీకి నిప్పంటింది. ఈ ఘటనలో ఆమె కడుపు భాగానికి గాయమవడంతో తాను పనిచేయలేకపోయారు. పనికి వెళ్లలేని స్థితిలో, యజమాని ఆమెను తొలగించారు. తరువాత ఆమె ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేసినా శరీరం బాగా లేకపోవడంతో ఎక్కడా ఉద్యోగం లభించలేదు. దీనివల్ల ఆమె ఆర్థిక పరిస్థితి మరింతగా క్షీణించింది. ఈ విషయంలో అలర్టా స్పందించిన అల్లగడ్డ పోలీసులు సంబంధిత ఏజెంట్లతో, మిగిలిన వ్యక్తులతో సంప్రదించి ఆమె కోసం విమాన టికెట్లను బుక్ చేయించారు. సమాచారం అందిన 48 గంటలలోనే ఆమెను గుర్తించి, తిరుగు ప్రయాణ ఏర్పాట్లు చేసి, చాగలమర్రిలో ఆమె కుటుంబానికి సురక్షితంగా చేర్చారు.

## భూభారతి చట్టంతో భూ సమస్యలకు సరైన పరిష్కారం



మంథని ( ప్రశ్న న్యూస్) గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల కు భూభారతి చట్టంతో సరైన పరిష్కారం లభిస్తుందని, రైతులు ఈ చట్టాన్ని ఉపయోగించుకొని లబ్ది పొందాలని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు గురువారం మంథని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో భూ భారతి చట్టం పై రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో తహాశిల్దార్ కుమారస్వామి రైతులకు భూ భారతి చట్టం గురించి వివరించారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ ధరణి తో పేరుకుపోయిన సమస్యలన్నిటికీ భూభారతి చట్టం చక్కని పరిష్కారం చూపిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భూభారతి చట్టాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూ సమస్యలపై రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ అనిల్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది సతీష్, మధుకర్, వరలక్ష్మి, శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశానికి మండల స్థాయి విద్యార్థుల ఎంపిక పూర్తి



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హకీంపేట,కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో 2025-2026 విద్యాసంవత్సరానికి 4వ తరగతి ప్రవేశార్థం నిర్వహించే ఎంపిక ప్రక్రియలో భాగంగా గురువారం బోయినిపల్లి మండలంలోని నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించబడ్డాయి. ఈ పరీక్షలకు మొత్తం 8 మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 7 మంది బాలురు, 1 బాలిక ఉన్నారు. హాజరైన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైనవారిని జిల్లా స్థాయి పోటీ పరీక్షలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎన్.శ్రావణ్ కుమార్,మండలంలోని వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమాభివృద్ధి కి కృషి చేస్తా

- పత్రికా విలువల రక్షణ కు తోడుగా ఉంటా
- చొప్పదండి శాసనసభ్యులు : డాక్టర్ మేడిపల్లి సత్యం
- సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారంటూ పాత్రికేయులకు ఎమ్మెల్యే ప్రశంస




బోయినపల్లి,(ప్రశ్న న్యూస్) సమాజానికి జర్నలిస్టులు చేస్తున్న సేవలు అమోఘమని, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో వారి పాత్ర ఎంతో విశేషమని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. బోయినిపల్లి మండల ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎమ్మెల్యేను గురువారం గంగాధరలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పట్నం ప్రసాద్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఎమ్మెల్యేకు పూలమొక్కను అందించి,ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ, జర్నలిస్టుల సంక్షేమాభివృద్ధి కోసం కృషి చేస్తానని, సమాజ నిర్మాణంలో పాత్రికేయులు చేస్తున్న కృషిని కొనియాడిన ఆయన, “మీరు వార్తల ద్వారా ప్రజల సమస్యలను,విజ్ఞప్తులను ప్రభుత్వానికి చేరవేస్తున్నారు. నిజానికి మీరు ప్రజల గొంతుక” అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు మంజూరుకు,అలాగే మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి త్వరలో స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాల్గొన్న జర్నలిస్టులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నల్లగొండ వేణుగోపాల్, ఉపాధ్యక్షులు గజ్జెల శ్రీనివాస్,గడ్డం తిరుపతి,కార్యదర్శి అతికం రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి కూస రవి, శ్రావణపల్లి గణేష్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఆలయంలో అవినీతి అరికట్టాలంటే ఐ.ఏ.ఎస్.స్థాయి ఈఓ అనివార్యం

- ఇంచార్జి ఈఓ లతో అవినీతి పెరుగుతోంది
- బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గం నాయకులు : పోతు అనిల్



వేములవాడ,(ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా పేరు గాంచిన, ప్రముఖ ప్రసిద్ధ శైవక్షేత్రమైన వేములవాడ రాజన్న ఆలయానికి ఐఏఎస్ స్థాయి కార్యనిర్వహణాధికారి (ఈఓ) అవసరమని బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం వేములవాడ నియోజకవర్గం నాయకులు పోతు అనిల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవేములవాడ రాజన్న ఆలయంలో జరుగుతున్న అవినీతికి అడ్డుకట్ట వేసేందుకు ఐఏఎస్ స్థాయి అధికారిని పూర్తిస్థాయి ఈఓగా నియమించాలని డిమాండ్ చేశారు. ఏటా రూ.138 కోట్ల ఆదాయం,రూ.28 కోట్ల కోడె మొక్కుల ద్వారా అధిక ఆదాయం వచ్చినా ఇంచార్జి ఈఓల వల్ల పరిపాలన బలహీనమైందన్నారు. లడ్డూ విభాగంలో అవినీతి, భక్తులకు దర్శనానికి ఇబ్బందులు, విఐపీలకే ప్రాధాన్యం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “ఆలయ ప్రతిష్టను కాపాడాలంటే ఐఏఎస్ స్థాయి అధికారిని ఈఓగా వెంటనే నియమించాలి” అని పోతు అనిల్ కోరారు.

# గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలే..

- క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర జాతీయ స్థాయికి ఎదుగాలే
- ఫౌండేషన్‌లు సామాజికసేవలో ముందుండాలే
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మంథని ( ప్రశ్న న్యూస్) గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం అందించే ఆలోచన చేయడం అభినందనీయమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బసంత్‌నగర్‌లో పరికిపండ్ల సత్యనారాయణ స్మారక ఉమ్మడి కరీంనగర్, వరంగల్ నిజామాబాద్, ఆదిలాబాద్‌జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తో కలిసి ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులకు వాలీబాల్‌ను అందజేసి వాల్‌బాల్ ఆడి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి క్రీడాకారుడు క్రీడాపోటీల్లో రాణిస్తూ రాష్ట్ర జాతీయ స్థాయికి ఎదుగాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. స్వచ్ఛంద సంస్థలు, ఫౌండేషన్‌లు సామాజిక సేవలోబాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని, ఆలయ ఫౌండేషన్‌ను స్థాపించి



అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి తన పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేలా అనేక సేవలు అందించడం అభినందనీయమన్నారు. మన ప్రాంతానికి చెందిన ఒకరు ఇలాంటి సేవలు అందిస్తున్నారని చెప్పుకోవడం గర్వంగా ఉందన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన శిభిరాలు నిర్వహించి వారి అండగా నిలువడం అభినందనీయమన్నారు. ఉచిత కంటి వైద్యశిభిరాలు, శస్త్ర చికిత్సలు చేయించడం ఆలయ ఫౌండేషన్ గొప్పతనానికి నిదర్శనమన్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బేటీ బచావో బేటీ పడావో రూపకల్పనలో ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి పాత్ర ఎంతో కీలమైందని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో ఆలయ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలు విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు.

# మంథనిలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్.



మంథని( ప్రశ్న న్యూస్) మంథని చౌరస్తాలో రాష్ట్ర, ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు మంథని మండల యూత్ కాంగ్రెస్ నాయకులు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంటరి రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, భారీగా బాణసంచాలు పేల్చారు వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి నాయకులు మండల అధ్యక్షులు అయిలి ప్రసాద్,పాక్స్ చైర్మన్ కొత్త శ్రీనివాస్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్ మాట్లాడుతూ

కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు వైనాడు నియోజకవర్గ పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. నిన్నటి త్యాగాలకు వారసుడు...రేపటి తరానికి మార్గదర్శకుల...భారతదేశాన్ని ప్రగతిశీల భవిష్యత్తు వైపు నడిపించగలిగే ఏకైక వ్యక్తి అధికారానికి నిజం చెప్పే నిర్భయ నాయకుడు కరుణ ధైర్యం రాజ్యాంగ విలువలకు చిహ్నం ప్రతి భారతీయుడి న్యాయం సమానత్వం కోసం మీరు చేసే పోరాటం ఈ దేశానికి ఆశను ఇస్తుంది. గొంతులేని వారిని శక్తివంతం చేయడానికి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి మీ ప్రయాణం కొనసాగాలి సామాజిక న్యాయం, సమానత్వం హక్కుల కోసం మీరు నిర్భయంగా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడం కోట్లాది మంది అణగారిన యువత, శ్రామిక ప్రజలకు ఆశాకిరణం. సమాజంలో చివరి వ్యక్తికి న్యాయం చేరవేయడానికి నవ యువ నాయకుడు రాహుల్ గాంధీ పోరాటం యువత భవిష్యత్తు తరాలకు స్పూర్తి గానే ఉండుగాక. భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్నివేళలా ప్రజల వైపు నిలిచే నాయకుడు నియంతృత్వాన్ని నిలదీస్తూ బిజెపి పాలనలోని లోటుపాట్లను అడుగడుగున ప్రశ్నిస్తూ నిజాయితీతో నిస్వార్థంగా ప్రజాక్షేత్రంలో నిరంతరం పోరాడుతున్న ప్రజానాయకుడు. అత్యంత ధైర్యవంతుడైన నాయకుడు ఉక్కు నరాలు కలిగిన వ్యక్తి ఆర్ఎస్ఎస్, బిజెపి ,పీడ కలలను భూస్థాపితం చేసే భారత తదుపరి ప్రధానమంత్రి సుప్రీం రాహుల్ గాంధీ భారత యువకులకు ఆదర్శ సోదరులైన రాహుల్ గాంధీ ఆలోచన భారతదేశ దార్శనికత భవిష్యత్తు అత్యుత్తమ స్థాయికి భారతదేశ అభివృద్ధి చేసే ఉద్దేశ్యంతో బంధించబడ్డారు. మీరు దృఢంగా నిలబడి ధైర్యంగా ముందుకు సాగాలి ప్రకాశవంతమైన భారతదేశం వైపు మన ప్రయాణంలో విజయం మనదే అవుతుంది ఈ కార్యక్రమంలో మండల, పట్టణ, యూత్ కాంగ్రెస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రముఖ వైద్యుడు చెన్నాడి రవీందర్ రావు విశేష సేవలతో ఖ్యాతి గడించారు

- ఆత్మీయ వైద్యులుగా ప్రజల మదిలో చెరగని ముద్ర వేశారు
- డాక్టర్ చెన్నాడి మృతి తీరని లోటు
- చొప్పదండి ఎమ్మెల్యే : మేడిపల్లి సత్యం
- పార్థివ దేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్య సాగర్ రావు కుటుంబ సభ్యులు,ప్రముఖ వైద్య నిపుణులు డా. చెన్నాడి రవీందర్ రావు గురువారం స్వర్గస్థులయ్యారు. వారి స్వస్థలమైన చొప్పదండి నియోజకవర్గంలోని బోయినిపల్లి మండలం, కోరెం గ్రామంలో ఆయన భౌతికకాయానికి ఘన నివాళులు అర్పించేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చొప్పదండి శాసనసభ్యులు డా. మేడిపల్లి సత్యం స్వయంగా గ్రామానికి చేరుకొని రవీందర్ రావు పార్థీవదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ”డాక్టర్ చెన్నాడి రవీందర్ రావు వైద్య రంగంలో తన విశేష సేవలతో పేరుగాంచారు. ఆత్మీయతతో కూడిన వైద్యుడిగా ప్రజల మదిలో చెరగని ముద్ర వేశారు. గవర్నర్ విద్యా సాగర్ రావు కుటుంబానికి అత్యంత అనుబంధంతో ఉన్న ఆయన మృతి బోయినిపల్లి మండల ప్రజలకు తీరని లోటు. ఆయన కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను,” అని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ ఎంపీపీ బొలుమాల శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏనుగుల అనిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రోమాల అజయ్, మెరుపుల మహేష్, సోషల్ మీడియా ఇంచార్జి శాలివాహన శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు అక్కనపల్లి ఉపేందర్, సంబ లక్ష్మిరాజం, కాంగ్రెస్ నాయకులు కొప్పుల నగేష్, గడ్డం తిరుపతి రెడ్డి, జాగిరి వెంకటేష్, ముద్దం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ బాల్స్ తో దోమల నివారణ

ప్రజారోగ్యమే ధ్యేయంగా పని చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పర్యవేక్షిస్తున్న శానిటరీ ఇన్స్పెక్టర్ గంగిలి మహేశ్వర్ రెడ్డి

-వంద రోజుల ప్రణాళికలో భాగంగా దోమల నివారణకై యుద్ధ ప్రాతిపదికన చర్యలు




జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) వర్షాకాలం దృష్ట్యా మురికి గుంతల్లో, నీటి నిలువ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్న దృష్ట్యా మున్సిపల్ పక్షాన దోమల నివారణకు చర్యలు చేపట్టామని జగిత్యాల మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ గంగిలి మహేశ్వర్ రెడ్డి చెప్పారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపల్ పరిధిలోని 4,8,10,13,30 వార్డుల్లో డ్రైనేజి లు శుభ్రం చేసి,చెత్త, చేదారం తొలగించడమే కాకుండా ఇళ్లల్లో నీటి నిలువలు ఉండకుడదని ప్రజలకు సూచించారు. నీటి నిలువ ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా మున్సిపల్ సిబ్బంది ఆయిల్ బాల్స్ వేసి మందు పిచికారీ చేశారనీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి, వెంకటరమణ, శ్రీకాంత్ జవాన్లు పాల్గొన్నారు.

## అభాగ్యులకు అండగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం

- చొప్పదండి ఎమ్మెల్యే : మేడిపల్లి సత్యం
- ప్రభుత్వం పక్షాన ఆర్థికంగా ఆదుకున్న ఎమ్మెల్యే సత్యం




బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన కుంటాల హరీష్ అనే యువకుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో ఈ ఘటనపై బాధిత కుటుంబాన్ని రెండు రోజుల క్రితం పరామర్శించిన చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం వారికి ప్రభుత్వం పక్షాన తగిన ఆర్థిక సాయం అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు తన మాటకు కట్టుబడి గురువారం స్వయంగా తడగొండకు వెళ్లి మృతుడు హరీష్ కుటుంబానికి రూ.1లక్ష విలువగల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,“అభాగ్యులకు అండగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, బోయినిపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కూస రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ ఎంపీపీ బొలుమాల శంకర్, తడగొండ మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఏనుగుల అనిల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడి శేఖర్ రెడ్డి, మెరుపుల మహేష్, సోషల్ మీడియా ఇంచార్జి శాలివాహన శ్రీనివాస్, మాజీ ప్రజాప్రతినిధులు అక్కెనపల్లి ఉపేందర్, సంబ లక్ష్మిరాజం, కాంగ్రెస్ నాయకులు కట్ట లచ్చయ్య, ఎండీ హుస్సేన్, మండల శ్రీనివాస్, కొప్పుల నాగేష్, కట్ట బాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం యువతకు ప్రేరణగా నిలుస్తోంది

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే : ఆది శ్రీనివాస్
- రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో.... “ఆది”



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌లో వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ అగ్రనేత,లోక్ సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “రాహుల్ గాంధీ దేశ భవిష్యత్ కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఆయన చేస్తున్న పోరాటం యువతకు ప్రేరణగా నిలుస్తోంది. దేశాన్ని ఐక్యంగా, సమానత్వబద్ధంగా తీర్చిదిద్దాలన్న సంకల్పం ఆయనలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన నాయకత్వంలో దేశానికి నూతన దిశలుంటాయని ఆశిస్తున్నాం”, అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# జైల్లే నయం

## కార్పొరేట్ విద్యాసంస్థల్లో నలుగుతున్న బాల్యం



- విద్యా ప్రమాణాలు గాలికి వదులుతున్న యాజమాన్యాలు
- హాస్టళ్ల కన్నా బందల దొడ్లల్లో నయం
- నిబంధనలు బేఖాతరు చేస్తున్నా పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- బహుళ అంతస్థుల భవనాల్లోనే చదువులు కంటికి కనిపించని ఆటస్థలాలు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- అవమానం భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న విద్యార్థులు

> "తల్లి దండ్రుల ఆశ... ఆశయాలే కార్పొరేట్ పెట్టుబడి...పిల్లల భవిష్యత్ కోసం వారు పడే తపన వారికి కాసులు కురిపిస్తోంది. తల్లిదండ్రుల బలహీనతలపై కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలు ప్రతి ఏటా వ్యాపారం చేస్తున్నాయి. కార్పొరేట్ ముసుగులో లక్షలు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయి. నియంత్రించాల్సిన పాఠశాల విద్యాశాఖ చోద్యం చూస్తోంది. వేసవి సెలవుల అనంతరం మేడ్చల్ మండలంలో గత గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి. అదే సమయంలో తల్లిదండ్రులు ఖర్చులకు భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ నేపథ్యంలో అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ల్యాబ్, ట్యూషన్, స్పోర్ట్స్, స్పెషల్ డేస్, కమ్యూనికేషన్ ప్రోగ్రాం ఫీజులంటూ ఇప్పటికే వేలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యాలు మళ్లీ పుస్తకాలు, నోటు- పుస్తకాలు, యూనిఫారం, షూ, టీ షర్ట్ అంటూ అందినకాడికి దోచుకుంటున్నారు"

**మేడ్చల్ ( ప్రశ్న న్యూస్)** విద్యా సంస్థలు తెరుచుకుని వారం రోజులయింది. కానీ మేడ్చల్ మండలంలో ప్రైవేట్ విద్యా సంస్థలు మాత్రం ప్రభుత్వ నిబందనలు పాటించడం లేదు. విద్యా ప్రమాణాలకు విరుద్ధంగా బహుళ అంతస్థుల్లో విద్యాబోధన చేస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. వేసవి సెలవులలో ప్రైవేట్ పాఠశాలలు అందమైన బ్రోచర్లు, పిల్లల ఫోటోలను నిలువుట్టదంలా ఫ్లెక్సిల్లో వేసి విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకుంటున్నారు. ఆ తరువాత సౌకర్యాల గురించి పట్టించుకోవడం లేదు. ప్రతి సంవత్సరం వేలకు.. వేలు ఫీజులు కట్టి అరకొర వసతుల మధ్య విద్యార్థులు చదువులు కొనసాగించాల్సి వస్తుంది. స్కూళ్లలో లిఫ్టులు సౌకర్యం లేదు. 10 నుంచి 15 కేజిల బరువున్న పుస్తకాలను నాలుగైదు అంతస్థులపైకి మోయడానికి పిల్లలు పడ్తున్న బాధలు అంతా ఇంతా కాదు. మేడ్చల్ మండలంలోని పలు వాణిజ్య సముదాయాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో పాఠశాలలను నెలకొల్పడం వల్ల స్కూళ్లు వదిలినప్పుడు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు నిత్యం బయపడుతూ పిల్లల పట్ల శ్రద్ధ తీసుకోకుండా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోకుండా గాలికి వదిలివేయడం పట్ల విద్యార్థి సంఘాలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి. వాస్తవంగా విద్యా వ్యాపారంలో అరితేరిన వారు ఎవరంటే ఎవరైన సరే.. ఇట్టే చెబుతారు పలు ప్రైవేట్ విద్యా సంస్థల పేరు. ఈ విద్యా సంస్థలలో ప్రతి ఏటా విద్యా మాటున దోపిడికి పాల్పడుతున్న ఇదేమని అడిగేవారు లేరు. వాస్తవంగా ఈ ప్రైవేట్ విద్యా సంస్థలు చదువులో చిట్టచివరి అని చెప్పవచ్చు. ఒకరో.. ఇద్దరో విద్యార్థులకు పరీక్షల్లో ర్యాంకులు రాగానే వారిని అందమైన బ్రోచర్లు, ఫ్లెక్సిలపై నిలువుటద్దంలా చూపి విద్యాలోకాన్ని మాయాలోకంలో విహారింప చేయడం ఈ కార్పొరేట్ విద్యా సంస్థలకు చెల్లింది. కానీ ఈ విద్యా సంస్థలలో విద్యా ప్రమాణాల విషయంకు వస్తే మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉంటుంది. ఇక విద్యా సంస్థల్లో విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు లేకపోగా, విద్యాబోధన పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి మాత్రం పీజులను జలగల్లా పీడుస్తూ వేలవేలకు దండుకుంటున్నారు. కేవలం ధనార్జనే ధ్యేయంగా ఈ విద్యా సంస్థలు మండలంలో కొనసాగుతున్నా విద్యాశాఖ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.

### అధిక శాతం బహుళ అంతస్థుల్లోనే..

కార్పొరేట్ విద్యా సంస్థల్లో అధిక శాతం బహుళ అంతస్థుల్లోనే ఉన్నాయి. ఈ విద్యా సంస్థల అపార్టుమెంట్లు ఐదు ఫ్లోర్ల నుంచి మూడు ఫ్లోర్ల వరకు ఉన్నాయి. వీటివల్ల చాలవరకు విద్యార్థులు వాటిలోనే విద్యను కొనసాగిస్తున్నారు. ఈ బహుళ అంతస్థులు కూడ రహదారులకు సమీపంలో వాణిజ్య సముదాయాలలోనే ఎక్కువగా ఉన్నాయి. వీటివల్ల పాఠశాలలు విడిస్తే చాలు ఒక్క సారిగా వందల సంఖ్యలో విద్యార్థులు పలు ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి బయటకు రావాల్సి వస్తుంది. దీంతో ఎక్కడ రోడ్డు ప్రమాదాలకు తమ పిల్లలు గురవుతారోనన్న భయం తల్లిదండ్రులకు లేకపోలేదు. అయినప్పటికి చదువుల కోసం బలవంతంగా తమ పిల్లలను ఆయా విద్యా సంస్థలకు పంపుతున్నారు. ఇక ఈ విద్యా సంస్థలు నిర్వహిస్తున్న బహుళ అంతస్థుల్లో కూడ చాల వరకు రాకపోకలకు సరైన మార్గాలు లేకపోవడం, ఇరుకు మెట్ల మార్గం గుండానే తరగతి గదులకు విద్యార్థులు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో తమ భుజాలపై 5 నుంచి 10 కేజిల పుస్తకాల బరువుమోస్తూ విద్యార్థులు పై అంతస్థుకు చేరుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇక ఈ భవంతికి అగ్నిమాపక శాఖ అనుమతులు ఉన్నప్పటికీ, ఈ శాఖ నిబంధనల మేరకు ఆయా విద్యా సంస్థలు పాటించకపోవడం గమనార్హం. పొరపాటున అగ్ని ప్రమాదం జరిగిందంటే భారీ నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. వాస్తవంగా బహుళ అంతస్థులో విద్యా సంస్థలు నిర్వహిస్తే వాటికి చుట్టుగా గ్రిల్ ఏర్పాటు చేయడంతో పాటు ఒకే మార్గం కాకుండా మరో మార్గం ద్వారా బయటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థల్లో అలాంటివి ఏమి కనిపించవు. వీటివల్ల విద్యార్థుల భద్రతకు భరోసా లేకుండా పోయింది.

### ఇరుకు గదుల్లోనే నలిగిపోతున్న బాల్యం..

చాల వరకు పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఇరుకు గదులలోనే విద్యార్థుల బాల్యం మగ్గుతుంది. వాస్తవంగా జీఓ నెంబర్ 1 నిబంధన మేరకు ఒక్కొక్క గది విస్తీర్ణం అనుగుణంగా 30 నుంచి 35 మంది విద్యార్థులు క్లాస్లో ఉండాల్సి ఉంది. ఇటీవల వాటిని మరింత కుదించారు. కాని పలు విద్యా సంస్థలు 50 నుంచి 60 మంది విద్యార్థులను క్లాస్లలో కుక్కుతున్నారు. ఇక ఈ విద్యా సంస్థలకు ఎక్కడ కూడ క్రీడా మైదానాలు లేవు. ఇక పాఠశాలలో పీఇటీలు ఉన్నారనే మాటే కాని వారిని ఆయా పాఠశాల విద్యార్థుల క్రమ శిక్షణ నేర్పించే వరకే పరిమితం చేశారు. విద్యార్థులకు క్రీడలు దూరమవుతుండగా, చదువుల పేరిట వారిని మరింత మానసిక క్షోభకు గురిచేస్తున్నారు. దీంతో ఆయా విద్యా సంస్థలలో విద్యను అభ్యసించాలంటేనే ప్రస్తుతం విద్యార్థులు భయపడిపోతున్నారు. గాల్లో దీపాల్లా విద్యార్థుల్లో ఆందోళన ఉన్నప్పటికీ కానీ తమ తల్లిదండ్రుల మనస్సు నొప్పించలేక ఇష్టం ఉన్నా.. లేకున్నా ఆయా విద్యా సంస్థలలో ఉన్న అన్ని బాధలు భరిస్తూ విద్యను అభ్యసిస్తుండటం గమనార్హం.

### మౌళిక వసతులు ఏవి..

ప్రైవేట్ విద్యా సంస్థలలో ఎక్కడ కూడ కనీస మౌళిక వసతులు లేవనే చెప్పవచ్చు. విద్యాశాఖ పొందుపరిచిన మేరకు జీవో నెంబర్ 1247 మేరకు ఆయా విద్యా సంస్థల్లోని క్లాస్ తరగతులకు తగిన విస్తీర్ణం మేరకు ఉండాలి. కాని ఇలా ఎక్కడ లేవు. చాలచోట్ల అనుమతులు లేని భవంతులను అద్దెకు తీసుకొని వాటిలో విద్యా సంస్థలను నిర్వహిస్తున్నారు. పలు ప్రైవేట్ విద్యా సంస్థలకు సంబందించిన భవనాలను పురపాలక సంఘం అనుమతులు కూడ పూర్తిస్థాయిలో లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక విద్యా సంస్థలలో విద్యార్థులకు భోజనాలు చేయుటకు ప్రత్యేకంగా హాల్ ఉండాలి. అయితే ఈ విద్యా సంస్థల్లో ఎక్కడ కూడ కనపడవు. ఇక పాఠశాలలోని సిబ్బంది, బాలికలు తీరిక సమయంలో సెదతీరేందుకు ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలి. అయితే ఇవి ఎక్కడ కనబడవు. వీటితో పాటు విద్యార్థులకు అటస్థలాలు, జీమ్ తదితర ఏర్పాటు చేయాల్సి ఉండగా, అలాంటి ప్రమాణాలు పాటించిన దాఖలాలు లేవు. ఇక విద్యా సంస్థలలో వచ్చే ఆదాయన్ని వాస్తవంగా 20 శాతం ఆయా విద్యా సంస్థల అభివృద్ధికి వినియోగించి, 50 శాతం ఆయా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల జీతాలు, ఇతర సిబ్బంది జీత భత్యాలకు వినియోగించాలి. అయితే ఇక్కడ నిబంధనలు పాటించిన దాఖలాలు లేవు. ఆయా ప్రైవేట్ సంస్థలలో పేరుకే కనీస విద్యార్హత కలిగిన టీచర్లు ఉన్నారే కానీ, ఎక్కువ శాతం డిగ్రీ చదివిన వారే విద్యార్థులకు చదువులు చెబుతుండటం గమనార్హం. విద్యాశాఖ రికార్డులు మాత్రం వీరికి వేతనం రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఇస్తున్నట్లు ప్రకటిస్తున్నా, వాస్తవ విషయంకు వచ్చే సరికి రూ. 6వేల నుంచి రూ.10వేలకు మించి ఇవ్వడం లేదు. ఇక పిఎఫ్, ఈఎస్ఐ మాట దేవుడెరుగు.

### ఇంత జరుగుతున్నా పట్టించుకోని విద్యాశాఖ..

మేడ్చల్ మండలంలో నిర్వహిస్తున్న పలు ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్య మాటున జరుగుతున్న దోపిడిని పట్టించుకునే స్థితిలో విద్యాశాఖ లేకపోవడం విమర్శలకు కారణమవుతుంది. కనీసం ఆయా విద్యా సంస్థలలో లోపాలను ఎత్తిచూపుతూ అటు విద్యార్థి సంఘాలు, ఇటు పత్రికల్లో వస్తున్న కథనాలను చూసైనా విద్యాశాఖ అధికారులకు గుండె కరగడం లేదు. కనీసం ఆయా విద్యా సంస్థల మెట్లను ఎక్కే ధైర్యం కూడా వారిలో కనిపించడం లేదు. ఇప్పటికే పలు ఆరోఫణలు వచ్చినా జిల్లా విద్యాశాఖ అధికారి కనీసం పరిశీలించిన దాఖలాలు లేవు

## ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలి

### ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇవ్వాలి అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్న పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఫీజులలో 50% వరకు రాయితీ ఇవ్వాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విద్యాసంస్థల యాజమాన్యాలను కోరారు.ఆయన అన్ని స్కూల్ కాలేజ్ ల్లో స్వయంగా తిరిగారు.కార్పొరేట్ స్కూళ్లలో చదువుకుంటున్న ఫీజులలో రాయితీ ఇచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గం పరిధిలో కార్మిక, పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉంటాయన్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇచ్చేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై సైనిక చర్య..

### రెండు వారాల్లో డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం: వైట్‌హౌస్



**అమెరికా (ప్రశ్న న్యూస్)** ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాబోయే రెండు వారాల్లోగా నిర్ణయం తీసుకుంటారని వైట్‌హౌస్ గురువారం వెల్లడించింది. ఇరాన్‌పై దాడి చేసే ప్రణాళికలకు ట్రంప్ సూత్రప్రాయంగా మద్దతు తెలిపారని, అయితే తుది ఆదేశాలు ఇంకా జారీ చేయలేదని వార్తలు వచ్చిన మరుసటి రోజే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ విలేకరులతో మాట్లాడుతూ, "సమీప భవిష్యత్తులో ఇరాన్‌తో చర్చలు జరిగే అవకాశం ఉన్నందున, దాడికి వెళ్లాలా? వద్దా? అనే దానిపై నేను రాబోయే రెండు వారాల్లో నా నిర్ణయాన్ని ప్రకటిస్తాను" అని ట్రంప్ చెప్పినట్లు లెవిట్ తెలిపారు. ఇరాన్‌తో దౌత్యపరమైన పరిష్కారానికి ట్రంప్ సుముఖంగా ఉన్నప్పటికీ, ఆ దేశం అణ్వాయుధాన్ని సంపాదించకుండా నిరోధించడమే తమ ప్రధాన లక్ష్యమని లెవిట్ స్పష్టం చేశారు. ఏదైనా ఒప్పందం కుదిరితే, అది టెహ్రాన్ యురేనియం శుద్ధిని నిషేధించాలని, అణ్వాయుధాలను అభివృద్ధి చేసే సామర్థ్యాన్ని నిర్వీర్యం చేయాలని షరతులు విధించాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. "అధ్యక్షుడు ఎల్లప్పుడూ దౌత్యపరమైన పరిష్కారానికే ఆసక్తి చూపుతారు. ఆయన శాంతిని కాంక్షించే ముఖ్య నేత. బలంతో శాంతిని సాధించాలనేది ఆయన సిద్ధాంతం. కాబట్టి దౌత్యానికి అవకాశం ఉంటే, అధ్యక్షుడు దానిని తప్పక అందిపుచ్చుకుంటారు. అయితే, అవసరమైతే బలాన్ని ఉపయోగించడానికి కూడా ఆయన వెనుకాడరు" అని లెవిట్ వివరించారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని నిలిపివేస్తుందో లేదో చూసిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొన్న విషయం తెలిసిందే. అంతకుముందు ఇరాన్‌పై దాడి చేసేందుకు నిర్ణయం తీసుకున్నారా? అని అడిగినప్పుడు "నేను చేయవచ్చు, చేయకపోవచ్చు. వచ్చే వారం చాలా కీలకమైంది. బహుశా వారం కంటే తక్కువే కావచ్చు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ గురువారం ఇరాన్‌లోని అణు సంబంధిత లక్ష్యాలపై దాడులు నిర్వహించింది. దీనికి ప్రతీకారంగా టెహ్రాన్ క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఒకటి బీర్‌షెబాలోని ఆసుపత్రిని ధ్వంసం చేసింది. దక్షిణ ఇజ్రాయెల్‌లోని సోరోకా వైద్య కేంద్రంపై ఇరాన్ రాత్రిపూట జరిపిన దాడి అనంతరం, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. ఈ పరిణామాలన్నీ ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత తీవ్రతరం చేశాయి.

# కాళేశ్వరం.. క్యాబినెట్ ఆమోదం చుట్టూ రాజకీయ వివాదం

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచినప్పటికీ, దాని నిర్మాణ ప్రక్రియ చుట్టూ రాజకీయ వివాదాలు ఆగడం లేదు. ముఖ్యంగా, ఈ ప్రాజెక్టు కేబినెట్ ఆమోదం లేకుండా నిర్మించబడిందనే ఆరోపణలు రాజకీయ వేదికపై తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు గట్టి కౌంటర్ ఇస్తూ, ఈ ఆరోపణలను ఖండించారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ-స్టేజ్ నీటిపారుదల పథకంగా గుర్తింపు పొందింది. గోదావరి నదిపై నిర్మితమైన ఈ ప్రాజెక్టు, తెలంగాణలో 18.25 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 టీఎంసీల తాగునీరు, 16 టీఎంసీల పారిశ్రామిక నీటిని అందించడానికి రూపొందించబడింది. 2016లో భూమి పూజతో ప్రారంభమై, 2019లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దీనిని జాతికి అంకితం చేశారు. అయితే, ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.80 వేల నుంచి రూ.1.47 లక్షల కోట్లకు పెరగడం, అలాగే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నిర్మాణ లోపాల ఆరోపణలు వివాదాస్పదమయ్యాయి.

### - కేబినెట్ ఆమోదం.. వివాదం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు కేబినెట్ ఆమోదం లేకుండా నిర్మించబడిందని ఆరోపించడం రాజకీయ రగడకు కారణమైంది. ఈ వ్యాఖ్యలు, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పారదర్శకత లేకుండా నిర్ణయాలు తీసుకుందనే సందేశాన్ని ఇవ్వడానికి ఉద్దేశించినవిగా కనిపిస్తాయి. దీనికి సమాధానంగా, ఈటెల రాజేందర్, కేబినెట్ ఆమోదం లేకుండా ఇంత పెద్ద ప్రాజెక్టు నిర్మాణం దేశంలో ఎక్కడా జరగలేదని, అలాంటి ఆరోపణలు నిరాధారమని వాదించారు. ఈటెల, అప్పటి కేబినెట్లో ఉన్న ముగ్గురు మంత్రులు (ఇప్పుడు కాంగ్రెస్లో ఉన్నవారు) స్పష్టత ఇవ్వగలరని సవాల్ విసిరారు.

### - ఈటెల వాదనలు..

ఈటెల రాజేందర్, కేసీఆర్ కేబినెట్లో ఆర్థిక మంత్రిగా పనిచేసిన అనుభవాన్ని ఆధారంగా చేసుకుని, కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి నిర్ణయం కేబినెట్లో చర్చించబడిందని, ఆమోదం పొందిందని గట్టిగా చెప్పారు. ఈ వాదనలు, ప్రాజెక్టు నిర్మాణంలో పారదర్శకత ఉందని, అన్ని చట్టబద్ధమైన ప్రక్రియలు పాటించబడ్డాయని సూచిస్తున్నాయి. అయితే, ఈటెల సవాల్లోని "దేశంలో ఎక్కడైనా ఇలాంటి సంఘటన ఉందా?" అనే ప్రశ్న, ఈ ఆరోపణల చుట్టూ రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయనే అభిప్రాయాన్ని బలపరుస్తోంది.

### - రేవంత్ రెడ్డి ఆరోపణలు..

రేవంత్ రెడ్డి ఆరోపణలు, బీఆర్ఎస్ ప్రభుత్వంపై అవినీతి, అక్రమ నిర్ణయాల ఆరోపణలను బలపరచడానికి భాగంగా కనిపిస్తాయి. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ విచారణ, నిర్మాణ లోపాలు, అవినీతి ఆరోపణలతో కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ వ్యాఖ్యలు రాజకీయంగా బీఆర్ఎస్ ను దెబ్బతీయడానికి ఉద్దేశించినవిగా అర్థమవుతోంది. అయితే, కేబినెట్ ఆమోదం లేని నిర్మాణం అనే ఆరోపణకు స్పష్టమైన ఆధారాలు లేని పక్షంలో, ఇది కేవలం రాజకీయ విమర్శగానే మిగిలే అవకాశం ఉంది.

### - కమిషన్ వాస్తవాలు వెలికితీసేనా.?

ప్రస్తుతం, జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ నేతృత్వంలోని కమిషన్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, డిజైన్ లోపాలు, ఆర్థిక అంశాలపై విచారణ జరుపుతోంది. ఈ కమిషన్ ఇప్పటికే ఇంజనీర్లు, రిటైర్డ్ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధుల నుంచి సాక్ష్యాలు సేకరించింది. కేసీఆర్, హరీశ్ రావు, ఈటెల రాజేందర్ వంటి రాజకీయ నాయకులను కూడా విచారించింది. ఈ విచారణ ఫలితాలు, కేబినెట్ ఆమోదం సహా ప్రాజెక్టు నిర్ణయ ప్రక్రియలోని సత్యాసత్యాలను వెల్లడి చేయవచ్చు.

### - కమిషన్ దృష్టిలో కీలక అంశాలు

- డిజైన్ మార్పులు: ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరంగా రీడిజైన్ చేయడం, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీ స్థలం మార్చడం.
- ఆర్థిక అంశాలు: రూ.1.47 లక్షల కోట్ల వ్యయం, కాంట్రాక్టర్లకు నిబంధనలకు విరుద్ధంగా బిల్లుల చెల్లింపు.
- నిర్మాణ లోపాలు: మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన బ్లాకులు, ఇసుక కొట్టుకుపోవడం వంటి సమస్యలు.

### - ఎవరికి లాభం?



కాళేశ్వరం వివాదం, తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్య జరుగుతున్న శక్తి ప్రదర్శనలో ఒక భాగంగా కనిపిస్తోంది. కాంగ్రెస్, ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ అవినీతికి ప్రతీకగా చిత్రీకరిస్తూ, ప్రజల్లో తమ పాలనా సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తోంది. మరోవైపు, బీఆర్ఎస్, కాళేశ్వరం ప్రాజెక్టును తమ పాలనలో సాధించిన గొప్ప విజయంగా చూపించి, ఈ ఆరోపణలను రాజకీయ కుట్రగా పేర్కొంటోంది. ఈటెల రాజేందర్, బీజేపీ నేతగా ఉంటూ బీఆర్ఎస్ కు మద్దతుగా మాట్లాడటం, రాజకీయ సమీకరణాల్లో మరో కోణాన్ని జోడిస్తోంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588